ఆంధ్రమహిళ

AM_ NOV 1961_17_11

ఏకైక మహిళాభ్యుదయ మాస పత్రిక

VOL: XVII ANDHRA MAHILA NOVEMBER 1961 No. 11

వి ష య సూ చి క

చందాదారులకు విజ్ఞప్తి

మావిన్నపాన్ని మన్నించి, కొందఱు చందాదారులు తమచందాలు పంపినా, ఇంకను చాలమంది పంపకున్నారు. వారికి సక్రమంగా ప్రతినెల 'ఆంధ్ర మహిళ' మాత్రం పంపుతున్నాము. వారియెడ మాకు ఉన్న విశ్వాసాన్ని పురస్కరించికొని అయినా, సాధ్యమయినంతత్వరితంగా చందాలుపంపి, యెప్పటిమోస్తరే 'మహిళ'ను పోషించాల్నని కోరుతున్నాము. లేనిపక్షంలో వారికి పత్రిక పంపటం మానుకోవలసివస్తుందని మనవి చేస్తున్నాము.

మేనేజరు,
"ఆంధ్ర మహిళ"

ఆంధ్రమహిళ

వ్యవస్థాపకురాలు : దుర్గాబాయి దేశ్‌ముఖ్

సంపుటి 17 :: నవంబరు, 1961 :: సంచిక 11

సంక్షేమ సంఘాలు: వాటి అభివృద్ధి

"సాధారణంగా కుటుంబాల్లో సమైక్యాన్ని చేకూర్చేవ్యక్తులు ముఖ్యంగా మహిళామణులే. తద్వారా, దేశంమొత్తం మీద సంఘీభావం విస్తరింపచేయటానికి అన్నిజాతులు ఒకటిగాకూడి పరస్పరసహకారంతో పనిచేయటానికి స్త్రీలసమూహం ఎక్కువగా తోడ్పడగలదు. మన భారతదేశంయొక్క భావ్యభ్యుదయం, దృఢత్వం పెంపొందాలంటే, జాత్యైక్యతను సుస్థిరంగా స్థాపించటానికి మనం పూనుకోవాలి. ప్రస్తుతం నేనిక్కడికి వచ్చేదానికిముందు, పంచాయతీసంస్థలఅధ్యక్షులు, సభ్యులు సమావేశం అయిన సభ ఆవిష్కరించటానికి వెళ్లాను. ఆసభ మిక్కిలి ముఖ్యమయింది. పెక్కుమంది వనితామణులు పంచాయతీసంఘాలకు అధ్యక్షురాండ్రుగా సభ్యురాండ్రుగా ఏర్పాటాల నని నాచిరకాలాభిలాష. వారైతే పంచాయతీసంఘాల కార్యాలకు ఎక్కువగా పాటుపడగలరనీ,— వారు తమకర్తవ్యాలను చక్కగా నిర్వహించగలరని గ్రహించటానికి వీలవుతుంది. పంచాయతీసంఘసంస్థల్లోని కర్తవ్యాల విషయాల్లో నారీమణులు సాధ్యమయినంతవరకు ఎలా పాల్గొని పనిచేయవలెనో తెలిసికొనగలరు. ఆ యీ కారణాలను అనుసరించి, వనితలు పంచాయతీసంస్థల్లో అధికసంఖ్యాకులుగా ఉండటం అత్యావశ్యకం."

"సంఘసంక్షేమ కార్యకలాపాల్లో అబలారత్నాలు పాల్గొననంతవఱకు అవి అసంపూర్ణాలనే భావించాలి. ఆకార్యక్రమపథకాలు పరిశీలించిచూస్తే, వివిధ సంక్షేమసంస్థలు ఒకటిగాచేరి పరస్పర సహాయంతో పనిచేయటానికి అవకాశం ఏర్పడి జాత్యున్నతికి ఏకదీక్షతో పాటుపడుతుంది. ఈవిషయంలో మీరు యుక్తంగానే సరియయిన మార్గాన్ని అవలంబించారని నాతలంపు."

"గాంధిమహాత్ముడు భారతదేశాభ్యుదయానికి చేసినఘనకార్యాల్లో, జాతిపునర్నిర్మాణానికై స్త్రీలు వహింపవలసిన బాధ్యతలనుగూర్చినది చాలముఖ్యమయినది. జాతీయతాస్ఫూర్తి వ్యాపింపజేసే విషయంలో పురుషులు చేకొనవలసిన శ్రద్ధకంటె, స్త్రీలు చేకొనవలసినదే అత్యంత ప్రధానమయినదని ఆయన ఉద్దేశం. స్త్రీలు చేయదగిన సంక్షేమకార్యాలెన్నో ఉన్నవి. కాని అవన్నీ జాతీయపునర్నిర్మాణమునకును, అందులోనూ ప్రత్యేకంగా, బాలింతల బిడ్డల యోగక్షేమాలకు సంబంధించిన విషయాలకును— సంబంధించినవే, ముఖ్యంగా గణింపతగినవి. కుటుంబ నియంత్రణపథకాలకు స్త్రీలెక్కువగా ప్రాధాన్యం ఇవ్వటం నాకు చాలాసంతోషప్రదమే. అయితే, అది తాత్కాలికోద్రేకంవల్ల యేర్పడింది కాకూడదు. దాన్ని జయప్రదంగా వాళ్లు కొనసాగించాలి. అందులో బిడ్డలవిషయంలో అమితశ్రద్ధ వహించాలి. వారివిషయంలో శ్రద్ధవహించటంఅంటే, భావిభారతదేశాభ్యుదయంకోసం శ్రద్ధవహించటం అన్నమాట! నేటి మనబిడ్డలే, రేపటిభారతపౌరులు.— ఇంతవఱకు బళ్లముఖం చూడని పసిపాపలవిషయంలో మనము ఏమీ చేయలేదు. వాళ్లని అశ్రద్ధతో చూచాము. మీసంస్థవంటివి కొంతవరకు ఈలోపాన్ని తొలగించటం

అమిత ప్రధానమవి భావిస్తున్నాను." మద్రాసు ముఖ్యమంత్రి శ్రీ నాడారుగారి అధ్వర్యంక్రింద జరిగిన ఇటీవల మదరాసులోని సంఘసంక్షేను సభావార్షికోత్సవంలో శ్రీ ప్రధానిగారు ఉపన్యసిస్తూ, పై విధంగా తమ అభిప్రాయాన్ని వెల్లడించారు.

శ్రీ ప్రధానిగారి అభిప్రాయాలతో మేము సంపూర్ణంగా ఏకీభవిస్తున్నాము. కాని, జాతైక్యతకు మహిళలు ఎక్కువగా తోడుపడాలంటే, వారికట్టి ఉత్సాహం పురుషులవల్లనే లభించాలి. అందులోనూ— నాయకులయిన వారు తమపలుకుబడిని ఉపయోగించి వారిలో సేవాకాంక్షను రేకెత్తించాలి. కాని నేటినాయకులలో అలాచేయగలిగిన వారెంతమంది? కేవలం స్వార్థపరులయి— దేశైక్యాన్ని భగ్నం చేయాల్సనే సంకల్పంతో, 'నాబుట్టా తట్టా, నాగుడ్డా గుడుసూ ఇలా పారేయండి; నాగతికొద్దీ నేనువెడతా'— ననే పురుషులు నాయకులుగా ఉండేంతవరకు ప్రజలలో విభేదాలు, చీలికలు, పొరపులు తప్పక ఉండనే వుంటాయ్. అలాటివి కులమతభాషావివాదాలకు దేనికి సంబంధించినవి అయినా ప్రమాదకరమే. అబలామణులు తమకు స్వతస్సిద్ధంగా ఏర్పడిన హక్కులకే పురుషుల పోటీలవల్ల తిలోదకాలిచ్చారు. ఇక పంచాయతీలు మొదలయిన ప్రభుత్వ సంస్థలలో అధికారం చేయటానికి పురుషజాతి సమ్మతించి సహించి ఊరకే ఉంటుందా? అది స్వప్నవృత్తాంతం. అతివలకు ఆధిక్యత లభించిననాడు దేశం బాగుపడుతుందని అభిజ్ఞులందరూ అంగీకరిస్తారు. అంతదూరమెందుకు? పూజ్యబాపుజీ ఒకప్పుడు, 'మనభారతభూమికి ప్రజాపరిపాలనం సిద్ధించి, మనం సంపూర్ణ స్వాతంత్ర్యంతో తులదూగేనాటికి ఒకహరిజననారీమణినే—దేశాధ్యక్షపీఠమెక్కేటట్లు చేయాలి'— అన్నారు. అగతికలయిన నారీమణుల విషయంలో వారి ఉదాత్తభావం అట్టిది.

ఈనాడట్టి మహాత్ముడు మనమధ్య లేనందుచేత, స్త్రీల అభ్యుదయం అడుగునపడింది. తద్వారా, వారిస్థితి ఏమాత్రం చక్కబడకపోగా, మునుపటికంటెకూడ అధ్వాన్నంగా తయారయింది. అందుకు కారణం పురుషజాతి తమకున్న హక్కులు వారికిగూడ గలవని భావించక పోవటమే. ఇక ప్రధానిగారు వచించిన సమైక్యతా సిద్ధి—ఎలా అభివృద్ధి చెందుతుంది?

జాతిపునరుద్ధరణకు ఎక్కువగా పాటు పడవలసినవారు స్త్రీలే అనటంలో అభిప్రాయభేదం కొంచెం కూడాలేదు. తక్కినరంగాల్లో స్త్రీబాధ్యత ఒకపరిమితికి లోబడి వుండవచ్చు నేమోగాని, సంఘసంక్షేమ విషయాల్లో మాత్రం ఆమె బాధ్యతే యెక్కువని. నేటి పసిపాపలే రేపటి స్వతంత్ర భారత పౌరులు. కాన, వారిని చిన్నప్పటి నుండి దిద్ది తీర్చేభారం సంఘసంక్షేమసేవికలు ముఖ్యంగా వహించవలసియున్నది. కాని మనదేశంలో కొన్ని కుటుంబాల్లో ఇండ్లలో పెరిగే తమ బిడ్డలవిషయంలో స్త్రీలు అలసభావం వహించే అలవాటు చిరకాలంగా— వస్తున్నదనేవిషయం మనం మరవరాదు. పురుషులందామా, ద్రవ్యార్జన విషయంలో రోజంతా సతమతమవుతూ వుండటంవల్ల, కొంతవటకు వారియిల్లాండ్రు పిల్లలసందర్భంలో పూచీవహిస్తున్నారు. కనుక మనకేమిలే అనే ఉపేక్షాభావంతో కొంత— అలక్ష్యంచేస్తున్నారు. అందువల్లనే, చాలమంది వర్ధమానులు స్వేచ్ఛాచారులయి, తమకుటుంబాలకే కాక, దేశానికే అపచారం చేస్తూవుండటం మనకు తెలిసినదే. చాలినంత అనుభవంలేక— దారితెన్నూ తెలియక, తమకు తామే పెద్దలయినట్లు భావించే పిన్నలను సక్రమంగా పెంచేయెడల జాతి పటిష్ఠమయి ధైర్యసాహసాలతో పురోగమనం చేయగలదు.

పడమటి దేశాలవారు ఈవిషయాన్ని యేనాడోగుర్తించి, సక్రమమార్గంలో తమబిడ్డలను పెంచుతున్నారు. శిశువులకు సంబంధించిన ప్రతి చిన్నవిషయాన్ని వేయికండ్లచూస్తూ, ఒక రక్షణపోషణలలోనే కాకుండా ప్రవర్తనలలోను ఎక్కువ శ్రద్ధవహిస్తూ, వారియందు కనబడే లోపాలనుకనిపెట్టి సరిదిద్దుతూవుంటారు. వారికి మూడేండ్లు నిండీనిండకముందే— నర్సరీ స్కూళ్లలో చేర్పించి సక్రమ పద్ధతులలో పెరగటానికి అనుకూలాలు కల్పించటమే కాక, వ్రాయ చదువ నేర్చిన స్థితికి వచ్చేటప్పటకి వారిని కాన్వెంటు స్కూళ్లకు పంపుతారు. అందుచేతనే అక్కడి పిల్లలు భావికాలంలో మంచి పౌరులుగా తయారుఅవుతారు.

పురుషులకంటే, స్త్రీలకే పంచాయతీలలో ఎక్కువ ప్రాతినిధ్యం, పలుకుబడి ఉండాలి. అందులోనూగ్రామ పంచాయతీలకు సంబంధించినంతవరకు, ఆరోగ్యము, వైద్యము, వ్యాయామము, ప్రాథమికవిద్య, పొదుపరితనము

ఇలాటివి స్త్రీసభ్యురాండ్రు గ్రామక్షేమాన్ని అనుసరించి, తత్రాపి— ముఖ్యంగా తమ బిడ్డలసౌకర్యాన్ని అనుసరించి వృద్ధిచేసే అవకాశం వుంటుంది. అంతేకాక, సంఘసంక్షేమ కేంద్రాలలో పురుషులతోబాటు స్త్రీలుకూడా నెరవేర్చవలసిన కార్యాలెన్నో వున్నవి. కాన, ప్రభుత్వంవారు పురుషులు సాధింపగల పనులను పురుషులకి అంగనామణులు నిర్వర్తించవలసినవాని అంగనామణులకి కేటాయించాలి. దేశంలో సంఘసంక్షేమ కార్యాలయాలు ప్రకృతం చాలాతక్కువ అనేచెప్పాలి. ప్రతిపల్లెలోను తప్పక సంక్షేమ సంఘాలు ఏర్పడాలి. అందులో శ్రద్ధకలిగి పనిచేసే సేవికా సేవకులు నిస్వార్థంతో, నియమానుసారం వర్తిస్తూ, రాబొయ్యే తరంవారికి ఆదర్శప్రాయులు కావాలి. ఇలా చేసేపక్షంలో భారతజాతి మహోన్నతస్థితికి రాగలదని మా విశ్వాసం.

పయిగా, ఆ యా రాష్ట్రాల అధికారులు, తమరాష్ట్రాల్లో ఇంకా అధికంగా, అనగా, గ్రామానికి సంక్షేమ సంఘాలను నెలకొల్పి వారి పురోభివృద్ధికయి పాటుపడాలి. ద్రవ్యసాధ్యమయిన సంక్షేమ సంఘనిర్మాణాలకు కేవలం ప్రభుత్వంమీదనే ఆధారపడకుండా, స్వచ్ఛందంగా గ్రామస్థుల తనిఖీక్రింద, వారి ఆర్థికసహాయంక్రింద ఏర్పడిన ప్రత్యేక సంఘాలు ప్రభుత్వంవారి పొందటానికి సహకారాన్ని దోహదం చేయగలవు.

కాన, ఆ యాజిల్లాల సంక్షేమ సంఘకర్తలు ఐకమత్యంతో, గ్రామసంక్షేమ దృష్టితో భావిభారత నిర్మాణానికి పూనుకొనవలెనని మాహృదయ పూర్వకాభిలాష. సంక్షేమ సంఘాలు స్వయంసహాయంతో తమకాళ్లమీద తాము నిలువగలిగేంతవరకు ప్రజలే అట్టి సంఘాలను పోషింపగలుగుతారనటానికి ఏమాత్రం సంశయంలేదు.

ఆంధ్ర యువతీ మండలి

హైదరాబాదు

పై మండలివారు నూతనముగా నిర్మించిన శిశువిహార భవనాన్ని 22-10-1961న తెరుస్తూ శ్రీమతి దుర్గాబాయిదేశముఖుగారు ఉపన్యాసించారు. శ్రీమతి రాణిసరళాదేవిగారు అగ్రాసనాధిపత్యం వహించారు.

శ్రీమతి దేశముఖుగారి యుపన్యాససారాంశము: అఖిలభారతప్రభుత్వ ఆంతరంగికసభచే, నియమింపబడిన ఉపసంఘంవారు, అక్షరాభ్యాసానికి, ముందు దశలోను ప్రాథమిక విద్యాభ్యాసదశలోను, తదనంతరదశలోను ఉన్న 3–6; 6–11;-ఏండ్లుగల బిడ్డలసమస్యనుగూర్చిన్ని 11 ఏండ్లవరకు వారి విద్యాబోధనసమస్యనుగూర్చిన్ని అందుకై ప్రభుత్వం, చేయగల సహాయాన్నిగూర్చిన్ని ఆలోచిస్తున్నారు.

ఆ 11 ఏండ్లలోపల ఈడుగల బాలికలకు విద్యావిషయంలో అనుకూలాలుకల్పించే ప్రణాళికలోని కార్యాలను నెరవేర్చే విషయంలో ఎంతవరకు ప్రభుత్వం ముందుకు పోగలదనే సందర్భంలో ఆయా రాష్ట్రాల ముఖ్యమంత్రులు చక్కగాపరిశీలించి నివేదికలను కేంద్రప్రభుత్వానికి పంపవలసినట్లు ఉత్తర్వులు జారీ చేయగోరి ప్రధానిని అభ్యర్థించినాము. ఇప్పటికి 6 నుండి 11 ఏండ్లవరకు వయస్సుగల శిశువులు 80లక్షలమంది పాఠశాలలకు వెళ్లి విద్యాభ్యాసం చేస్తున్నారు. తగినంత విద్యా సౌకర్య సాధనాలు ఏర్పడే పక్షంలో, ఇంకా 180లక్షలమంది పాఠశాలలో చదువుకోగలరు. కేవలం చట్టాలు చేసినంతమాత్రాన ప్రయోజనంలేదు. స్వచ్ఛందంగా పనిచేసే సంస్థలుకూడా తమవిధులను సక్రమంగా నెరవేర్చాలి.

మండలి కార్యదర్శిని, శ్రీమతి శ్యామలాదేవి— సభకువచ్చినవారికి స్వాగతవాక్యాలుపలికింది. శ్రీమతి బి. లక్ష్మి వార్షికనివేదికను సమర్పిస్తూ 'శిశువిహార్'లో ప్రకృతం 300మంది విద్యార్థినులున్నారని తెలిపినది. క్రొత్త శిశువిహార మందిరం నిర్మించటానికి రు10,000 లు వ్యయమయిందనికూడా చెప్పినది.

అగ్రాసనాధిపత్యం వహించిన శ్రీమతి సరళాదేవిగారి ఉపన్యాసంతోను మండలికార్యకర్త్రిణి సభాభివందనాలతోను జాతీయగీతం పాడటంతోను సభ సమాప్తమయింది. ('హిందూ' 23-10-61-సోమవారము)

ఆంధ్ర మహిళాసభ : మదరాసు

నర్సులకు నూతన వసతి గృహము

అడయారులోని ఆంధ్రమహిళాసభ నర్సింగుహోము నందు నర్సులకయి నూతనభవనం నిర్మించటానికి శంకుస్థాపనోత్సవము 20–10–61నాటి సాయంకాలం 5–30గంటలకు మదరాసు విశ్వవిద్యాలయోపాధ్యక్షులయిన డాక్టరు లక్ష్మణస్వామిమొదలియారుగారి యాజమాన్యంక్రింద జరుపబడింది. పశ్చిమవంగరాష్ట్ర ముఖ్యామాత్యులగు డాక్టర్–బిధాన్‌చంద్రరాయిగారు శంకుస్థాపనము చేసిరి. శ్రీమతి దుర్గాబాయిదేశముఖుగారు పరిచయ వాక్యములు పలుకుతూ, డాక్టరురాయిగారు ప్రభృతులకు సుస్వాగతమిచ్చినారు. ఆసమయమున శ్రీమతి దేశముఖుగారు ఇలాచెప్పినారు:–

"తొమ్మిదేండ్లకు సెలవుగా శ్రీరాయిగారు మన మధ్యకు ఈనాడు రావటం అత్యంతామోదకరం. ఈశుభ సమయంలో మనతోబాటు వారు పాల్గొనడం ఎంతైనా ప్రశంసింపతగింది. ఆంధ్రమహిళాసభకు సంబంధించిన అన్ని సంస్థలలోను పలువిధములైన కార్యాలు జరుపబడుతున్నవి. అందులోఆర్థోపెడిక్ శాఖ అతిప్రధానమయినది. ఈసంస్థలో సహకరించటానికి తరిబీతు పొందుతున్న నర్సులు, మంత్రసానులు, మున్నగువారి సౌకర్యార్థం ఇప్పుడు క్రొత్తవసతిగృహం ఒకటి నిర్మించటానికి నిశ్చయింపబడినది. ప్రతిసారి అలా తరిబీతుపొందేవారి సంఖ్య 65నుండి 70వఱకు ఉన్నది. వారికి ఆల్ ఇండియా నర్సింగు కౌన్సిలువారు పరీక్షలు జరుపుతున్నారు. అందులో నెగ్గినవారికి గ్రామాభివృద్ధి(Community Development Blocks) కేంద్రాలలో నౌకరీలు దొరుకుతున్నవి. కాని, అట్టివారు కావలసినంతమంది దొరకకపోవటానికి కారణం, వసతిగృహాది సౌకర్యాలు లేనందువల్ల, తరిబీతునిచ్చే సంస్థలలో పరిమితికి మించి చేర్చుకొనటానికి అవకాశం లేకపోవటమే. నర్సుల–మంత్రసానుల తరిబీతును కుటుంబ నియంత్రణ విధానాల అభ్యాసాన్ని అభ్యసించటానికి వచ్చే మహిళలకు వసతి గృహాన్ని నిర్మించటానికై అఖిలభారత ప్రభుత్వం ఆర్థికంగా మూడు లక్షలరూపాయలు సహాయంచేసింది. ప్రకృతం నిర్మించనున్న నూతన వసతిగృహం దాదాపు 150మంది తరిబీతు పొందటానికి అవకాశం ఇవ్వగలదు."

అనంతరం సభాధ్యక్షులయిన డాక్టరు లక్ష్మణస్వామి మొదల్యారుగారు– "నర్సింగువృత్తి చాల ఘనమైనది. కావున వారు ఆరోగ్యవతులుగాను ఉత్సాహంగల వారుగాను ఉండవలెనన్న, వారివృత్తికి అనుగుణముగ చక్కని వాసస్థానాలు, తక్కిన సౌకర్యాలు అమర్చవలెను. అప్పుడే వారు తమకర్తవ్యాలను శ్రద్ధతోను సంతోషంతోను నెరవేర్చగలరు" అని వక్కాణించినారు.

తరువాత డాక్టరు రాయిగారు ఇలా ఉపన్యసించినారు:–

"ఈ మహిళాసభ పలువిధములైన రంగములలో సంతృప్తికరంగా పనిచేయటం నాకానందాన్ని చేకూర్చింది. ఒకకార్యాన్ని మనం సాధించవలెనంటే, ఆర్థికవిషయం కంటె, హృదయపూర్వకమయిన శ్రద్ధ, దీక్ష, ఉత్సాహం– ఇవి ప్రధానంగా ఉండవలెను. దాదాపు తొమ్మిదిసంవత్సరాలక్రింద నేను మదరాసుకు వచ్చినప్పటికంటె– ఈనాడది అనేకవిషయాలలో అభ్యుదయాన్ని సాధించి, పెంపొందినది. నేనప్పుడు చూచిన చోట్లనే ఇప్పుడు గుర్తింపలేకుండ ఉన్నాను. అందమయిన చక్కని సముద్రతీరంగల యీమదరాసునగరం చాల అదృష్టవంతమయినదని నాఅభిప్రాయం. మెరీనాబీచి పొడవున మద్రాసుపురవాస్తవ్యులును, ప్రభుత్వాధికారులును అద్భుతములయిన కట్టడములను కట్టించుటచేత, అక్కడ పనిచేయువారు ఆరోగ్యవంతములగు పరిసరములు గలిగి, తమ కార్యములు సునాయాసముగ చేయుపాటవము గలవారై ఉన్నారు."

ఆంధ్రమహిళాసభకు సంబంధించిన అనేకశాఖలలోని కార్యములనుగూర్చి మెచ్చుకొనుచు డాక్టరు రాయిగారు ఈవిధంగా చెప్పినారు :

"ఆంధ్రమహిళాసభవంటి గొప్పసంస్థను చూచిననాకు అందలి ఉపయుక్తములయిన కార్యక్రమములు కన్నులు తెఱపించినవి. మారాష్ట్రమయిన పశ్చిమవంగదేశమున గల సంస్థలు పెక్కింటిలో కార్యములు చేయుటకు మేము కేవలము పురుషులమీదనే ఆధారపడటం పెద్దపొరపాటని ఊహించుచున్నాను. నేను తఱచుగా స్త్రీలసహాయం చాలఅవసరమయినదని నొక్కి చెప్పుచున్నను, ఈనాటి వఱకు లభించినదికాదు, ఈలాటి అద్భుతములయిన గొప్పకార్యక్రమాలలో స్త్రీలుకూడా చేరి పనిచేయునట్లు ప్రోత్సాహం ఇచ్చుచున్న మదరాసును మనసార అభినందించుచున్నాను. సంక్షేమరాజ్యాన్ని సృష్టింపదలచు

కొన్న పూజ్యనాయక శిరోరత్నమయిన మనమహాత్ముడు ఘంటాపథంగా చెప్పుచుండిన విధంగా, ఇక్కడి మహిళామణులు తమకర్తవ్యాన్ని నిర్వహించుచున్నారు. ఇది అత్యంతగౌరవాపాదక వృత్తులకు దారి చూపు గొప్ప సంస్థ. ఈమహిళాసభ నిర్వర్తించుచున్న కార్యాలు ఇంకను విస్తరించగలవని మనస్ఫూర్తిగను నిస్సందేహముగను నొక్కివక్కాణింపగలను. ఆతరువాత చిన్నతనంలో నేను చూచుకొనుచుండిన నర్సుసేవ ఎంతో నాకు ఉపకరించినది.

నర్సుపని చికిత్సకుని (వైద్యుని) పనికంటె ముఖ్యమయినది. తనవృత్తిలో పేరుప్రతిష్ఠలు పొందవలెనంటే, వైద్యుడు తానే ఒక మంచినర్సుగా ప్రవర్తించవలెను. అతడు తనజీవితాన్ని వ్యాధిగ్రస్తునియొక్క అనుభవాన్ని చక్కగా గ్రహించటంతో ప్రారంభించవలెను. ఇదే నర్సులుచేసేకార్యం. ఈమహత్సేవను సామాన్యస్త్రీసమూహానికి వదలిపెట్టకూడదు. కాని ప్రతి వైద్యుడు మనసారా నర్సుచేసేపని తానుకూడా చేయటానికి తయారై వుండవలెను. నేను వైద్యవిద్యార్థిగా వున్నరోజులలో నర్సుపనికూడా చేసేవాడను. నర్సులకు ఆనాడు మరీ కరవుగా ఉండేది.

ఈమహిళాసభలో నర్సుతరిబీతు పొందటానికి—మైసూరు, ఆంధ్రప్రదేశ్, కేరళ రాష్ట్రాలనుండికూడ విద్యార్థినులు వచ్చిచేరటం మిక్కిలి మెచ్చదగినవిషయం. ఇలా నానారాష్ట్రాలనుంచి నానాజాతులనుంచి వచ్చిచేరిన వీరందరు అభిన్నభావంతో ప్రవర్తించటంవల్ల సమైక్యభావం సిద్ధించే విధానంకూడా ఏర్పడటం సహజం. ఇటీవల ఢిల్లీలో సమావేశంఅయిన మహానాయకులందరూ చర్చించిన సమైక్యభావం చేకూర్చటానికి, ఇట్టివి ఉపకరించే అవకాశాలను కల్పించగలవు. కనుక నర్సుసేవాభ్యాసమునకు వచ్చేవారికి వసతిగృహాదికసౌకర్యాలు అత్యంతముఖ్యములని భావించాలి, అందు ఒక్కొక్కరికి విశ్రాంతిపొందటానికి, తమవృత్తికి సంబంధించిన గ్రంథాలు చదవటానికి, ఆపద్ధతులను అలవరుచుకోవటానికి ప్రత్యేకంగా గదులు ఉండవలెను"—అన్నారు.

ఆవెనుక ఆంధ్రమహిళాసభా సంయుక్తకార్యదర్శిని యొక్క సభాభివందనాలతోను, జాతీయగీతము పాడటంతోను కార్యక్రమము సమాప్తమయినది.

('హిందూ' 21-10-'61 శనివారము)

మూడవ ప్రణాళికా కాలంలో బాలికల విద్యాభివృద్ధి

మూడవప్రణాళికలో బాలికల విద్యావిధానాలకు ప్రత్యేక కార్యక్రమం నిర్ణయిస్తూ, 1962—63—లో ఆయా రాష్ట్రాలు తమ ఉద్దేశాల్ని తెలుపుతూ, తగినసలహాలు కూడా పంపవలెనని ఒకలేఖ పంపండి. ఏలనంటే—బాలికల ప్రాథమి విద్యావిషయంలో చాలినంత ప్రయత్నం చేయటం ప్రాధాన్యమని కమీషన్ భావిస్తూన్నది. ఈరంగంలో మూడవ ప్రణాళికా కార్యక్రమాల ప్రకారం ఎక్కువ మందికి విద్యాభ్యాసంకోసం అనుకూలం కలుగుతున్నది. కనుక 1962—63—వ—పథకంలో చాలినంత వరకు ఉపపత్తులు ముందుగానే ఆ యారాష్ట్రాలు చేయాల్నని కమీషన్‌వారు తమలేఖలో సూచించారు. ఈమార్గం అవలంబిస్తే చాలమందికి విద్యార్జనకు పాఠశాలలలో అవకాశం లభిస్తుంది. ఆక్టోబరు 30—31 తారీఖులలో న్యూఢిల్లీయందు సమావేశం కాబోయే అఖిలభారతప్రాథమిక విద్యాసంఘం (All India Council for Elementary Education) సభ్యులు బాలికలలో విద్యకు సంబంధించిన పథకాన్ని తాము చర్చించేవిషయాల్లో అత్యంత ప్రాముఖ్యమయినదిగా ఊహిస్తున్నారు.

మూడవ ప్రణాళికనుగూర్చి ఆసభలో సమాలోచించే సందర్భంలో, మహిళోపాధ్యాయుల్ని, ఎక్కువమందిని తయారుచేయటానికి వీలు కలిగేట్లుగా ప్రోత్సహించటానికి తగినమార్గాలను మైసూరు ప్రభుత్వంవారు సూచించినారు. బళ్లలో చదువుకునేవారికి మధ్యాహ్నభోజనభాజనాదులు సమకూరని ప్రదేశాల్లో—ఆయారాష్ట్రప్రభుత్వాలు శ్రద్ధవహించి—అలాటివాటికి తగిన ఉపపత్తులు కల్పించాలి. (హిందూ—25—10—61 పత్రికనుండి)

బెల్లంకొండ రామరాయకవి

శ్రీ జీ. కృష్ణమూర్తి

[మన తెనుఁగునాట గీర్వాణ సారస్వతమున మెఱికల వంటి విద్వత్కవీంద్రులు పెక్కురు మున్ను జన్మించి, తమ ప్రతిభాతిరేకమున యశోలత లన్ని దెసలఁ బ్రాఁకునట్లు చేసిరి. అందు కోలాచలము మల్లినాథసూరియు, జగన్నాథ పండితరాయలును సుప్రసిద్ధులని యెల్లరకుం దెల్లము. మఱి కొందఱు ఉద్దండులైన పండిత కవి మండల మండను లూరుం బేరును లేక విస్మృతి పథమునఁ బడి నామావశిష్టులై చనుట ఆంధ్రుల దురదృష్టము. అట్టి చరిత్రలేమాత్రము లేనివారిలో కీ|| శే|| శ్రీరామరాయకవి తల్లజుఁడొకఁడు. ఈతనిగూర్చి 9–7–’61 ‘హిందూ’ ఆదివారము నాటి పత్రికానుబంధమున తెలిపిన శ్రీ జీ. కృష్ణమూర్తిగారి సంగ్రహాంగ్ల వ్యాసమునకు ఈ క్రిందిది నా యాంధ్రానువాదము.]

వే. వేం. కృ.

శ్రీరామరాయకవి, తన ముప్పదవ పడిలోఁ దీవ్రవ్యాధిగ్రస్తుఁడుగాఁగా, ఆ కాలమున పేరుమోసిన సుప్రసిద్ధ ఆయుర్వేద వైద్యులగు శ్రీ పండిత దివి గోపాలాచార్యులు కవిగార్కితో “మీరు ఆరోగ్యవంతులుగ నుండవలయునన్నచో, మేధస్సునకు మితిమీఱిన శ్రమ నొసంగుట మానుకొని సంపూర్ణముగ విశ్రాంతిఁ గొనవలెననిరి. దానికి రామరాయకవి యిచ్చిన ప్రత్యుత్తరము: “అశాశ్వతమగు ఈశరీరమువలన నేఁజేయఁదగిన దేమియున్నది? పొందగలవి యెల్లఁ బొందితిని. ఇంక నీ బొంది (మేని)తోఁ బనిలేదు” అని.

తుదకది యట్లే యయినది. ఆతఁడు దేహధారిగఁ దన కర్తవ్యమును ముగించితిననియే సంతృప్తి వహించి, యెపుడేని ఒడలిఁ జాలింప సంసిద్ధుఁడుగ నుండెను.

బెల్లంకొండ రామరాయకవి 1875 సం|| న డిసంబరు 27 వ తారీఖున, గుంటూరు మండలమందలి నరసారావుపేట తాలూకాలోని ‘పమిడిపాడు’ అను గ్రామమున జన్మించెను. అతఁడు ఋగ్వేదశాఖఁ జెందిన నియోగిబ్రాహ్మణుఁడు. రామానుజాచార్య విశిష్టాద్వైత సిద్ధాంతము ననుసరించు కుటుంబములోనివాఁడు. అతఁడు గుంటూరులో ఆంగ్లవిద్యమ నభ్యసింపఁ బాఠశాలలోఁ బ్రవేశించెను. కాని మూఁడవ ఫారము చదువునప్పుడు విడువరాని శరీరానారోగ్యము కారణముగ, నా చదువు చాలించి స్వగ్రామమునకు మరలిపోవలసి వచ్చెను. అట్లుపోయి తన 14 వ యేటనుండి సంస్కృతము నేర్వసాగెను. తన మేనమామలలో ఆ సారస్వతమున నిష్ణాతులయిన యొకరికడ రఘువంశము కుమారసంభవ కావ్యములలోఁ గొన్ని భాగములు పఠించెను. ఇఁక మేఘసందేశ మారంభించుసరికి, గుర్వపేక్ష లేకయే దానిం దానే చదివి, యవగాహనము చేసికొనునంత తెలివిగలవాడయ్యెను. పదుమూఁడు పదునెనిమిదేండ్ల మధ్య వయస్సులో అతఁడొక అద్భుత సన్నివేశమునకు గురియయ్యెను. ఒకానొకరేయి అతఁడు నిద్రించుచుండ, నతని స్వప్నమున శ్రీ హయగ్రీవస్వామి యొక వృద్ధబ్రాహ్మణ రూపమున సాక్షాత్కరించి, హయగ్రీవ మంత్రముపదేశించి, తత్సంబంధములగు యంత్రకవచాదులు పొందుటకు, సమీప గ్రామమగు దమ్మలపాడులోని గత్నమాచార్యు నాశ్రయింప, తక్షణము వెడలుమని యాజ్ఞాపించెను. హయగ్రీవదేవుని యానమెయి రామరాయకవి యాగ్రామమునకు వెడలి, ఆచార్యునిగూర్చి విచారించి, యుపాస్యదైవవాక్యము వాస్తవమని తెలియవచ్చినందులకు సంతోషాశ్చర్యోత్సాహభరితాత్ముఁడయ్యెను. అప్పటినుండి అతఁడు హయగ్రీవునకత్యంత భక్తుఁడు. ఏతన్మంత్రధ్యాన ప్రార్థనాసక్తుఁడయ్యెను. దాని ఫలితముగ నతఁ డేగురుని విద్యకొఱకు ఆశ్రయింపకయ, మహావిద్వాంసుఁడయ్యెను. రామరాయకవి తన 16 వ-యేట నుండియే, సంస్కృత శ్లోకరచన చేయసాగెను. మంచి యౌవనమున నతఁడు నైషధకావ్యమును, రసగంగాధరమును శిష్యులకు బోధింపజాలియుండుటయేగాక, తన మతస్థుల కెల్ల శ్రీరామానుజాచార్య విశిష్టాద్వైత సిద్ధాంతములను చక్కఁగ అవగాహనమగునట్లు వ్యాఖ్యానించ గలిగియుండెను.

అట్లు అసమాన విజ్ఞానముతో తనరారుచుండియు, రామరాయనికి తర్కవ్యాకరణములకు సంబంధించిన సందేహములు గొన్ని తటస్థించి, వానిని దొలఁగింప సమర్థుఁడగు గురుదేవునికొఱకయి యన్వేషింప జొచ్చెను.

అతని పాండిత్య ప్రతిభావిశేషము లెఱిఁగిన విద్వాంసు లనేకులు, తమసందేహములఁ దీర్పజాలమి నెఱుంగ, నతని సమీపించుటకే జంకుచుండిరి. చాలాకాలమట్లు గడువఁగా వ్యాకరణశాస్త్రమున నిష్ణాతుఁడనిపించుకొన్న రాగెళ్ళ రామశాస్త్రి, తర్కశాస్త్రమున ప్రవీణుఁడగు రాగెళ్ళ సుబ్రహ్మణ్యశాస్త్రి యను సోదరద్వయము రామరాయకవికి తటస్థపడిరి. అందు రామశాస్త్రియొద్ద మనకవి సిద్ధాంతకౌముదిని మూఁడుమాసములలో అభ్యసించెను. ఆయన తన స్వస్థలమునకు వెడలిపోగానే, సుబ్రహ్మణ్యశాస్త్రి కవికి తర్కశాస్త్రమును మఱి మూఁడు నెలలలో పాఠముచెప్పి తన యూరికేగెను. ఆ విద్వద్ద్వయము, తమ నివాస ప్రదేశముల కరుగుచు, తమ వ్యాకరణ తర్కశాస్త్ర గ్రంథముల నన్నింటిని రామరాయకవియొద్దనే వదలిపెట్టి చనిరి.

కొన్ని నెలలు కడచిన పిదప ఒకానొక శుభకార్యమునకు రామరాయలు తన గురువుల నిరువుర నాహ్వానించెను. ఆ సమయమున రామరాయకవి సంస్కృతమున సిద్ధాంతకౌముదికి వ్రాసిన వ్యాఖ్యానమును తనగురుదేవులకు చూప, వారదిచూచి యాశ్చర్యచకితులయిరి. అతడు 1901 సం|| న ‘శరద్రాత్రి’ యను కృతిని నిర్మించెను. ఆ సంవత్సరము నుండియే, అతఁడు యెడతెగక కేవలము వెఱ్ఱివానివలె తదేకదీక్షతో గ్రంథములు రచించెను. 1902–వ యేట తన గురువులలో నొకరి యాదేశానుసారము ‘అభినవకాళిదాస’ బిరుదాంచితుడగు చిదంబరశాస్త్రి ప్రణీత ‘చంపూభాగవ

తమునకు వ్యాఖ్యానము వ్రాసెను. 1904 సం|| న మురారి కృత 'అనర్ఘరాఘవమునకుఁ గూడ వ్యాఖ్య విరచించుటయే గాక 'హ' కారము అన్ని నామములకు మొదటవచ్చునట్లు 'హయగ్రీవ సహస్రనామములను' తద్వ్యాఖ్యానము మున్నగు ధర్మశాస్త్ర గ్రంథములొనరించెను.

రామరాయకవి విశిష్టాద్వైత మత కుటుంబమున జన్మించినవాడగుట, అతడు విడువకుండ క్రమముగ రామానుజ భాష్యములనుగూర్చి బోధించెడివాడు. ఆ తరువాత నతడు విద్యారణ్యుల 'పంచదశి'ని సమగ్రముగ జూచుటచే నతనికద్వైతసిద్ధాంతము నెడ మిక్కుటమగు నాస్థ జనించెను. అతఁడు భగవత్పాదుఁడగు శంకరాచార్య రచనములను 'అద్వైతసిద్ధి' 'ఖండనఖండఖాద్యము' మొదలగు గ్రంథములను తనకు తానే స్వల్పకాలమున పఠించి, అవగాహ మొనర్చుకొనెను. 1908 సం|| న అద్వైతామృత' మను కృతిని 1000 శ్లోకములుగల 'కృష్ణలీలా తరంగిణి' యను గ్రంథమును చేసెను. అటుపిమ్మట ఆయేటనే 'శంకర గీతా భాష్యార్క ప్రకాశిక' యను వ్యాఖ్యానమును వెలువఱచెను. అది 1909 లో ముగించెను. ఈ యుత్కృష్టరచనము మూలమును, దాని శంకరభాష్యమును విస్పష్టభావ బంధురముగ మూడు సంపుటముల గ్రంథము. సంస్కృతమ్మననే యితని వ్యాఖ్యానములు అపూర్వ భావగర్భితములును సంగ్రహములు నయినవి.

ఈ యత్యంతోత్తమ గ్రంథపాఠకులు మన వేదాంతము నామూలాగ్రము గ్రహింపవలెనను నుత్సాహముతో మొదటినుండియు, చివరదాఁక చదువక విడువరు. ఇక్కవీంద్రుడు 1909 సం|| న పరమాత్మ సహస్రనామావళిని సల్పెను. ఈ వర్షముననే, ఇరువదిదాటని వయస్సున నితడు 'రుక్మిణీ పరిణయచంపువు' అను కావ్యము విరచించెను. 1910 సం|| న ఆతడు 'శారీరక చతుస్సూత్రవిచార'మను కృతిని చేసెను. అంతియగాక, మొదటి నాలుగు 'బ్రహ్మసూత్రముల'కు వ్యాఖ్యానమును, 'కందర్పదర్పవిలాస'మను పద్యనాటికను కొన్ని అష్టకములను వ్రాసెను. 1911 సం|| న 'వేదాంత ముక్తావళి' 'త్రిమతసమ్మతము' 'లోకాయతాది మతఖండనము' అను గ్రంథములు నిర్మించెను. అందు వేదాంతముక్తావళి 890 శార్దూలవిక్రీడిత శ్లోకములుగల కృతి. రామరాయకవి ఈ గ్రంథమునకు తానే వ్యాఖ్యానము వ్రాసెను. ఇవి రెండు ముఖ్యములగు ఉపనిషత్తుల అభిప్రాయములను వెల్లడించునవి. ఇందలి శ్లోకములు అమృత ప్రవాహమువలె ఆనందప్రదమయిన శ్లోకములతో నీ కవివర్యుఁడు మరపగాహ వేదాంతవిషయమున నెంతసులభముగ వ్రాయగలడనుటకు గొప్పసాక్ష్యముగ విలసిల్లుచున్నది. 1911 లోనే ఈతడు 'సముద్రమథన' మను 1216 శ్లోకములతో నొప్పు రెండాశ్వాసముల ప్రబంధమును ప్రచురించెను. ఆ మరుసటియేట 'శ్రీ శంకర శాంకరీ భాష్యవిమర్శ' 'విద్యార్థివిద్యోతితం' 'ధర్మప్రశంస' 'ధనవర్ణనము' మున్నగు రచనములు గావించెను. ఇందలి మొదటికృతి మాత్రము 400 ముద్రితములగు పుటలుగలవయి, శ్రీ శంకరభగవత్పాదుని మతసిద్ధాంతముల యొక్క యుత్కృష్టతను దెలుపును. అద్వైతమును గూర్చి విపులముగ తన గ్రంథములు వెల్లడించునవిగ చెలువారవలయునని రామరాయుని, యాశయము. అద్వైత సిద్ధాంతములు వివరించుచు నతడు పదునాలుగు గ్రంథములు బయల్వఱచెను. 1901 నుండి 1912 వఱకు అతడెన్నియో రచనములు చేసెను. మొత్తముమీద ఇతఁడు వ్రాసిన గ్రంథములు (సంస్కృతమున) 143. అందుకొన్ని యింకను లభింపలేదు. కొన్నిటిని మాత్రము సంపాదించి శ్రీ కవితా సుబ్రహ్మణ్యశాస్త్రిగారు వెలువరచినందులకు ఎంతేని కృతజ్ఞతాపాత్రులు. ఈ కవిపుంగవుని యనంతరము, ఇతని రచనములు గల కాగితములు చెత్తబుట్టకు దాఖలు కావలసినవిగ భావించి కుటుంబములోని యితరులు వాని నమ్మివైచిరి. ఆ విషయ మెఱింగి శ్రీ సుబ్రహ్మణ్యశాస్త్రిగారు అమితప్రయాసతో సేకరింప పూనుకొని చాలవఱకు కృతకృత్యులయిరి. ఆ వ్రాతప్రతులలో 1912 సం|| నకు వెనుక వ్రాయబడిన కృతి యొక్కటియు గానరాదు. అట్టి వ్రాత ప్రతులను జాగ్రత్తగ పరిశీలించితిమేని, ఈ కవీంద్రుడు తన మనస్సు ఉత్సహించినపుడే వానిని లిఖించినట్లు, గద్య పద్య భాగములు రెండును, సమానస్థాయిలో చెప్పకయే చెప్పుచున్నవి. వానిలో మధ్యమధ్య కొట్టివేతలు, సవరణలు మొదలగునవి యెందును గాన్పించవు. అతని మేధస్సు అద్భుత జ్ఞాపకశక్తి గలది. అతడు చదివిన విషయములకెల్ల నది భాండాగారము, తాను గ్రంథరచన మొనర్చునపుడు ఉదాహరణార్థ మతడే గ్రంథమును జూచువాఁడు గాఁడు. అతని ధిషణామహత్త్వ మెల్లప్పుడు గావలసిన సారస్వతాంశము లందించుచుండెడిది. కానిచో సంపుటములకొలఁది ఉత్తమరచనా వైశిష్ట్యము గల కృతినిర్మాణ మొక్కనికెట్లు సాధ్యమయ్యెనని విచక్షణు లాశ్చర్య పడెడివారు. కాని రామరాయ కవి అవి యెల్ల హయగ్రీవదేవ ప్రసాదితములనెడివాడు. అతడు తన రచనముల నన్నిటిని భగవదంకితములు చేసెను; కాని నరమాత్రుల కొసంగలేదు.

అతడు దీర్ఘమగు నజీర్ణవ్యాధి కగ్గముగాగా, తుదకది అతని 32 ఏండ్లప్రాయమున బహుమూత్రమునకు దారితీసెను. అతడు పూర్తిగ అనారోగ్యముతో బాధపడుచుండినను, ఏతత్కారణమున తన సారస్వతసేవ మానినవాఁడు గాడు. ఆరోగ్యము కొఱకయి యతడు గుంటూరు, విజయవాడ, మున్నగు పట్టణములకు వెడలెను. కాని అతని రోగము దినక్రమేణ అతని శరీరమును శుష్కింప జేయుటచే తన ముప్పదెనిమిదేండ్లయీడున, 1914 సం|| అక్టోబరు 27 వ తారీఖున దేహము చాలించెను.

పెక్కురు ఉద్దండ పండితులు మహా విద్వత్కవులవలె అతడు తన గొప్పతనమునకు తగిన విలువ నొసంగెను. రామరాయని ఘనత అతని జీవితకాలమున గుర్తింప బడలేదు. శ్రీ సుబ్రహ్మణ్యశాస్త్రిగారి బహుళ ప్రయత్నముతో అమ్మహాకవి కృతులు కొన్ని బయల్వెడలిన యీ నాఁడును అతని వాఙ్మయ ప్రభావము వెలికివచ్చుటలో ఆలస్యమగుటకు మూలము, మనవారి యలసభావమే. హయగ్రీవ దేవు ననుగ్రహమున త్వరితముగ రామరాయ కృతులు భారతీదేవికి అమూల్యాభరణము లగుఁగాక.

('హిందూ' 9-7-'61 సారస్వతానుబంధమునుండి.)

ANDHRA MAHILA SABHA

NURSING HOME & NURSES' TRAINING CENTRE

Statistics for the Month of September, 1961.

OUT-PATIENT REGISTER:—

No. of Surgical cases treated	25
" " Medical " "	653
" " Gyneac " "	79
" " Ante-natal " "	235
" " Post-natal " "	48
" " E.E.N.T. " "	38
" " Dental " "	5
Total " " New Patients	1083
" " " Old "	1144
Grand Total	2227

ADMISSION REGISTER:—

No. of Patients admitted for Normal Deliveries	121
" " " " " Abnormal: Forceps -5, I. P. Version-1	6
" " Medical Cases Treated	33
" " Post Natal "	1
" " Gyneac "	25
" " Ante-natal c False pains	23
" " " " c Toxeamia	4
" " Surgical Cases	2
" " Babies admitted as Lodgers	121
Grand Total	334

(True Copy)


(Sd.) Dr. K. R. AMBUJA,
Resident Medical Officer.

(Sd.) Dr. M. PAVANA BAI,
Medical Superintendent.

Smt. V. LAKSHMI PARVATHI.
Secretary.



ఆంధ్ర మహిళాసభ నర్సెస్ హాస్టలుకు శంకుస్థాపన శ్రీ చింతామణీ దేశ్‌ముఖ్, అధ్యక్షతవహించిన డాక్టరు లక్ష్మణస్వామి ముదలియార్, భవనమునకు శంకుస్థాపనచేసిన డాక్టరు బి. సి. రాయ్, మహిళా సభ వ్యవస్థాపకురాలు దుర్గాబాయి దేశ్‌ముఖ్.



టౌన్ ప్లానింగ్ మహాసభకు విచ్చేసిన మహిళలు మా ఆర్థోపిడిక్ సెంటర్‌ను దర్శించి

వరుడు కావాలి

శ్రీ ఈమని నర్సింహమూర్తి

"దివిసీమ వరదబాధితులకు సత్వరసహాయం చెయ్యాలి; బిన్నీవారిమాస్కాట్, అందంగా హుందాగా ఉండే ఉత్తమమైన చొక్కాగుడ్డ; క్రొత్తరెక్సోనా మీచర్మానికి గుణకారి; చేరండి! మేనర్సగ్రైప్‌మిక్చర్ అదృష్టపుపిల్లల పోటీలు" అని ఒకేకంఠశోష పెట్టిన రాజారావు "ఒరేయ్ పూరీ! నీఅదృష్టం పండిందిరా!" అని ఒక్కగంతుతో పూర్ణచంద్రరావుని సమీపించి "చూశావా! యీ శీర్షిక. 'వరుడు కావాలి.' అందమైన అమ్మాయి. పేరు కృష్ణవేణి.... వయస్సు16సంవత్సరాలు. చదువు.... పి. యు. సి. పాసయిందట. కులం యింటర్వ్యూకాలమందు తెలుపబడును. కట్నం పాతికవేలు. దరఖాస్తులతో పాటు అభ్యర్థులు 15వతేదీకి చేరాలట. యిదిగో అడ్రసు. C/o లలితామనోహరనివాస్....విజయవాడ-2" అని గ్రుక్కతిప్పుకోకుండా నప్పచెప్పేశాడు.

అప్పటికీ నాన్నపోరు పడలేక, అమ్మమ్మకళ్లు తుడిచేందుకు పదేపదే యింటర్వ్యూలకి వెళ్లివచ్చిన వరుడు పూర్ణచంద్రరావు "బావా! నాపరువు తియ్యకురా. నేనంత చవటను కానురా. పదేపదే యింటర్వ్యూలకి వెళ్లేనంటే, అది నాయిష్టంమీద కాదు. అమ్మ, నాన్న, అమ్మమ్మ వాళ్లంతా నన్ను ఒకేయిదిగా తినేస్తున్నారని. పోనీ ఏదో పెళ్లిచేసుకుందామా అంటే, వాళ్లేదో వంకలెంచుతున్నారు. యింక నేనెట్లా చచ్చేదిరా" అన్న పూరీమాటలకు రాజారావు "బావా పోయిందిలేదు. యీయింటర్వ్యూకికూడా అప్లై చెయ్యిరా. కులంమాట మీవాళ్లకు చెప్పవద్దు. యింకా వీళ్లు చాలామంచివాళ్లని.... ధనవంతులనీ.... ఏవేవో చెప్పి.... లేకపోతే మనమిద్దరమే వెళ్లి నిశ్చయించుకువచ్చి యింటికి ఉత్తరం వ్రాద్దాం" మన్న బోరింగుకు తాళలేక పూర్ణచంద్రరావు తనపరువు, మర్యాద ఎక్కడ మంటగలిపేస్తాడోనని "సరే యిదిగో యిప్పుడే వ్రాస్తున్నా, 15 జనతాకి వస్తున్నామని. యింక టైములేదు. త్వరగా రేపటిప్రయాణానికి తయారవ్వు" అన్నాడు.

కాలేజికి శలవుచీటిపంపి.... జనతాలోపడ్డారు. ఒకే యిదిగా ఆతృత పడుతున్న రాజారావు ఆలోచనలకి అంతరాయం కలిగిస్తూ పూరి "ఒరే! రాజా, మనం 15వ నాటికి తిరిగి ఎలాగైనా వచ్చీయాలిరా. మానాన్న యింకో సంబంధమేదో తీసుకువస్తున్నాడు. తప్పకుండా నిశ్చయం చేసుకోవాలని వ్రాసే" డన్న పూర్ణచంద్రరావుతో "ఫరవా లేదురా! అంతకంటే మనమే ముందు ఆయనకి చెప్పాం; యింతమంచి సంబంధం మరిరాదనీ, కట్నం చాలా ఎక్కువ యిస్తారనీ.... యింకా వీలయినన్నికోతలు కోదాం. ఫలించెనా అదృష్టవంతుడివే. లేదా.... యింక యీ యింటర్వ్యూలకి స్వస్తి చెప్పేద్దువుగాని, పెళ్లిచేసుకొనేది నీవుగాని వాళ్లుకారుగా. గట్టిగా నీవ్యక్తిస్వాతంత్ర్యం పురస్కరించుకొని చెప్పు. పైగా పోలిటిక్సు బి. ఎ. చదువుతున్నావాయె. ఆమాత్రం చెప్పలేవురా" అని. యింతలో రానేవచ్చింది విజయవాడ స్టేషను. కీచుగొంతుకతో రైలాగింది.

రాజారావు అడ్రసు తీసుకొని మళ్లీ మళ్లీ చదువుకొని కొంచెం సందేహిస్తూ "ఒరేపూరీ! యీకృష్ణవేణి గతసంవత్సరం మనకాలేజీలో చదివిన వాలుగన్నుల తోయజాక్షి కాదుకదా" అన్నమాటలకు పూర్ణచంద్రరావు అర్థోక్తితో "ఆమెఅయితే, యిప్పటికీ ఎవ్వరినో, మనకాలేజీలో ఎంచుకొని యుండునురా. యింతధనవంతురాలయి, అందగత్తెఅయినది, విద్యావతిఅయినది, ఆవిధంగా చలాయిస్తే ఎవడో ఎత్తుకొని పోయివుండును. ఆ కృష్ణవేణి యిదికాదురా" అన్నాడు. తమహోదా ప్రకటించాలన్న గర్వంతో. టాక్సీమాట్లాడి బయలుదేరారు.... ఒకవీధిలో పైకి మనోహర దృశ్యమయిన భవంతిని చూసి అదేనన్నారు. కాని ఏం, బోర్డులేదే అని మరికొంచెంపాగి, నల్లబోర్డుపై మసకమసకగా అగుపిస్తున్న అక్షరాలను గుర్తుపట్టి ద్వారంవద్దకు సమీపించారు. ఎంతోమనోహరంగా ఉంటుందనుకొన్న నివాసం, అతిపేలవంగా కనుపించటంతోటే, పూర్ణచంద్రరావుకి, తమ హుందాకి చులకనయినట్లయింది. గుండెల్లో రైళ్లు పరుగెత్తాయి. ఆలోచనా తరంగాలు మనస్సులో కొట్టుకొంటున్నాయి. సమాధానందొరకలేదు. యింతడబ్బు ఖర్చుపెట్టి వచ్చినందుకు ఏమి జరుగుతుందోనని భయపడి తిరిగిపోదామనుకొన్నాడు. కాని రాజారావుకి తను చులకనయిపోడూ? సరేనని తలుపుతట్టారు. కొద్దిసేపట్లో తలుపు తీయబడింది.

వింతరూప ప్రత్యక్షంతో. నౌకరు లాగుందని సరిపుచ్చుకొని, లోన ప్రవేశించేసరికి, ఒక 30 సంవత్సరాలామె, చిరునవ్వుతో 'రండ'ని ఆహ్వానించింది. ఆమెయే కాబోలు 'లలితామనోహరి' అనుకున్నాడు రాజారావు.

కాఫీఫలహారాలనంతరం, ఆమె వారిని నఖశిఖ పర్యంతం వీక్షించి "మీలో ఎవ్వరమ్మా వరుడు'' అని ప్రశ్నించింది. యిద్దరూ ఒకేతీరులో నుండటంజూచి, సవ్యంగానే వుంది ప్రశ్న అని, రాజారావు పూరీని చూపించి "వీడే నండి, పూర్ణచంద్రరావు, ఫైనలియరు బి. ఏ. చదువు తున్నాడు. బాగా ధనవంతులండి. తల్లిదండ్రుల ప్రోత్సా హంచే నన్ను.... అని" చెప్పబోతూండగా ఆమె "మీకు కాదు యింటర్వ్యూ కావలసినది. ఆయన, మీరేమీ చెప్ప నక్కరలేదండి. దానితో పూర్ణచంద్రరావుకి చిరు చెమ్మట్లు పోశాయి. రాజారావుకి చెంపదెబ్బ కొట్టినట్ల యింది. అన్యాయంగా వాడిని వెనకేసుకు వచ్చినందుకు బాగేనే అయింది శాస్తి అని, యిన్ని యింటర్వ్యూలకి వెళ్లి నా తన్నీవిధంగా పరీక్షించలేదని, రాజారావుతో రూము మేటుగా చేరినందుకు బలేవిషమ పరిస్థితి తెచ్చిపెట్టాడని, పూరి చింతిస్తూ, ఆమెపిలుపుకి ఉలిక్కిపడి, యింకోగదిలో ప్రవేశిస్తూ "యింటర్వ్యూ యిక్కడకాదాండి' అన్నాడు. "మరి మీఅప్లికేషను యింకా చేరందే, మీరు సరాసరి వచ్చేస్తే, 'ఎలాచెప్పండి? నారికి మిమ్ములను పరిచయం చేసి, మీవిషయంచెప్పి వారిచే అంగీకరింప చేయాలన్న" మనోహరి (ఊహతో) మాటలకు పూరీ, కొంచెం నిట్టూర్చి "యింతకీ, ఆ లలితామనోహరి మీరుకాదండి'' అన్నాడు.

ఆమె యింక యింటర్వ్యూ స్థలంలో ప్రవేశిస్తామనగా, ముందు జాగ్రత్తపడవలసిన విషయములన్నీ చెప్పి, "ఆయన మనోహర్ పూర్వమొకజమీందారనీ, లలితా దేవిగారి పరిచయంవల్ల కొద్ది కాలాని కామెను వివాహ మాడి, విజయవాడలో లలితా మనోహరనివాస్ భవనం నిర్మించి, మధ్యకాలంలో గతించారనీ, చాలధనవంతు లనీ, లలితమ్మను, మనోహర్ కోర్కెప్రకారం, కృష్ణ వేణికి గొప్పగా పెళ్లిచేయ నిశ్చయించారని, కాని చాల మంది. ఆమె కులాన్ని శంకించి, కుమార్తె నెవరూ వివా హం చేసుకొనటం లేదనీ,అందుకని చదవ వేస్తే, అదికూడా సఫలంకాలేదని, పత్రికలో ప్రకటిస్తే, ఎవరైనా వస్తే అప్పు దేవిధంగానైనా నచ్చచెప్పి పెళ్లిచేసెయ్యోచ్చని, అందుకే, కులంమాట పత్రికలో యింటర్వ్యూ కాలమందు తెలుపబడునని ప్రకటించామని" చెప్పింది. పరిచారిక మాటలకు విస్తుపోతూ, పూర్ణచంద్రరావు లేనిగొడవ' తెచ్చిపెట్టుకొన్నానని చింతిస్తూ, లలితమ్మగారికి నమస్క రిస్తూ ప్రవేశించి దగ్గరనే ఉన్న కుర్చీలో ఆసీను డయ్యాడు.

గదిఅంతా పరిశుభ్రంగా వుంది. కుత్సితపుబుద్ధుల వాళ్లకి అలంకారం, సింగారమని, అది వాళ్లమాయలను కప్పి పుచ్చుతుందన్న నానుడి వీళ్లవిషయంలో నిజమనుకొన్నా డు. చుట్టూ నాలుగుకుర్చీలు.. మధ్యరెండు టేబిలు.. గోడల కందంగా అలంకరింపబడిన ఫోటోలు అతన్ని ఆకర్షించి నయి. పైన పటారం, లోనలొటారం, అన్నట్లు కాకుండా, లోనగల యీఅలంకరణను, వాటికి తగ్గ యీమనుష్యు లనూ చూచి, కొంచెం ఆనందించాడు పూర్ణచంద్రరావు. ప్రతినమస్కారం, చేసిన లలితమ్మగారు, దాసితో, "సుభద్రా! అమ్మాయిని తీసుకురా" అని– "నీపేరేమి టబ్బాయీ?" అంది. కోర్టులో ముద్దాయి రూపం దాల్చిన పూర్ణచంద్రరావు "నాపేరు పూర్ణచంద్రరావండి" అన్నాడు. "యింతకీ మీరు పెళ్లిచేసుకుందుకే వచ్చారా? లేక ఏదో తమాషా చెయ్యటానికి వచ్చారా?" అన్న మనో హరి రెండవప్రశ్న పూర్ణచంద్రరావుకి విషం మ్రింగి నంతపనయి'' పరిస్థితులనుకూలిస్తే, పెళ్లిచేసుకునేందుకే వచ్చా'' నన్నాడు.

"మరి మీకులం'' మనోహరి మూడవప్రశ్న.

"వైశ్యులమండి" పూర్ణచంద్రరావు అయిష్టపుజవాబు.

"సరే ఇంకేం సరిపోయింది. మాదికూడా అదే. ఆవిధంగా కలవస్తుందో రాదో నన్న. సంశయంతో ప్రకటన ఆవిధంగాచేసాం. మాఅదృష్టం' పండిందన్నమాట. మరి మీచదువు, మీఆస్తిపాస్తులు వగైరా వివరిస్తారా!" అన్న లలితమ్మగారి ఆఖరిప్రశ్నకు పూర్ణచంద్రరావు అంతా వివరంగా చెప్తూ, యింకా వాళ్ళనాన్నగా అనుమతి తీసుకోవాలనీ, మళ్ళీవచ్చి ముహూర్తం నిశ్చయిస్తా మనీ, భయంతో చెప్పి యింకేం అడుగుతుందో నని తొందరగా, "మరి నేను వెళ్ళవచ్చునాండి" అన్నమాట కామె "సుభద్రా! యింకా అమ్మాయిని తీసుకురాలే" అన్నకేక కృష్ణవేణి నొకకుర్చీలో నాసీనురాలిని చేసింది. క్రొత్తపెళ్ళి కూతురగుటచే కొంచెంసిగ్గు అభినయించింది' పూర్ణచంద్రరావుకు కృష్ణవేణిరాకతో కళ్ళుచీకట్లు కమ్మే ట్టయింది, అనుకున్నంత అయిందా అనుకొన్నాడు. గత సంవత్సరం వాళ్ళకాలేజిలో చదువు వెలగబట్టి....రంగా రావు రెక్కొన్నా ఎద్వరుటైజుమెంటుకి యిమిటేషను అని పిలువబడే, కృష్ణవేణి, పూర్ణచంద్రరావు తేరుకొని మనస్సులో ఆలోచించి. "నీవేతప్ప నితఃపరంబెరుగ మన్నింపదగున్ దీనునిన్" అనిగట్టిగా రాజారావుకేక వేశాడు. సమయంకోసం' కాచుకొక్కచున్న రాజా.... ఒక్కదూటులో ప్రవేశించి కృష్ణవేణిని చూచి సడెన్

బ్రేకయి! "అనుకున్నంత అయిందా?" అన్నమాటకు కృష్ణవేణి విస్తుపోయి చూస్తూ మనసులో" అయ్యో, అమాయకులు. నాగురించి శ్రమపడి వచ్చేరన్నట్టుగా తలచి హేళనచూపుతో, కనికారం కాస్తరవ్వ తగిలేట్టు 'సుభద్రా. కాఫీలవి' యివ్వని చెప్పి తనబాధ్యత పూర్తయిందని లోనికివెళ్ళింది. లలితమ్మగారు ఏదోవిపరీతం, జరుగుతుందని ఆలోచిస్తూండగా జరిగిన యీ హఠాత్సంఘటనికి నిట్టూర్చి "ఏం మీకు అమ్మాయి నచ్చినట్టేనా? యింకా ఏమైనా భోగట్టాలుకావాలా?, యింటికి టెలిగ్రాం యిచ్చి మీవారిని రప్పిస్తారా? ముహూర్తం నిశ్చయం చేదాం. ఏవిషయం చెప్పండి" అన్నట్టు ప్రశ్నార్థకంగా చూచింది.

కాఫీలనంతరం "మరి సెలవండీ ఉత్తరంవ్రాస్తాం" అని బ్రతికి బయటపడ్డామురా అన్న దీవాననాలతో కారులో కూలబడ్డారు. రాజారావు యిదంతా తనవల్లే జరిగిందని. ఏంగొడవ చేస్తాడో, అన్న భయంతో, పూరీతో "ఒకేపూరి క్షమించరా! ఎడ్వర్టైజుమెంటు చూచి మోసపోయా. నీకన్యాయం జరిగింది. యీవిషయం మీనాన్నతోటి వాళ్ళతోటి చెప్పకురా. అన్నమాటకు పూర్ణచంద్రరావు "రాజా! యింతకీనన్ను బ్రతికిబయటపడనిచ్చావురా.... లేకపోతే.... అసలువిషయం తెలిస్తే, యింక నన్ను కదలనిచ్చేవారు కారు. బలవంతంగా కట్టిపడేద్దురు.... నీసహవాసం చాలురా. యింక యింటర్వ్యూవద్దు....పెళ్లీవద్దు" అన్నదీనపుమాటలకు రాజారావు తగినబుద్ధి కలిగిందికదా అని ఒకచెంప సంతోషిస్తూ, రెండవచెంప అయ్యో, యింతఅన్యాయం జరిగిందా అని విచారిస్తూ స్టేషను సమీపించారు. బరువుగా నిట్టూరుస్తూ రైలు ప్రవేశించింది. మౌనంగా ఎక్కారు. తమఅజ్ఞానానికి చింతిస్తూ. అనుభవం గడించిన వ్యక్తులు పరాజయులని రైలుకూత 'కూ'అంది. విజయవాడ కుద్వాసన చెప్పిన రైలు తనపనిలో నిమగ్నమయింది.

అభాగిని

శ్రీమతి రాధ

మగడు గతియించినీలోన సెగలుగొలుపు
ప్రణయ బాధాగ్ని పుంజమ్ము రగులుగొలిపె,
చెల్లి! నీ లేత మోము చూచింది మొదలు
జాలి దోలుకాడి నా గుండె జలదరించు,॥

పాలబుగ్గల మిసమిసల్ పసిమిజిమ్మ
లేత నాజూకు భావముల్ లేచుచుండి
ఆపుకోలేని హృదయమ్ము నదిమిపట్టి
ఎట్లు సైరింతువో చెల్లి! యిట్టిచింత?॥

పండు వెన్నెలరాత్రిని గుండెలందు
పరువులెత్తెడి మూగ భావముల జూచి
కులము మర్యాద గంగలో గలుపకమ్మ,
ముక్కు చిట్లించుకొనును ఈ పురుషజాతి॥

ధర్మకర్తల "కర్మ" సిద్ధాంతములకు
మాఘమాటాడకుండ మీవారు చేరి
బలియొనర్చ బంగారువంటి బ్రదుకు
ఎన్ని నాళ్ళొట్లు నీవు సహింతువమ్మ?॥

"ఎచ్చటున్నావు చెప్పు నేడింతవరకు?
ఏమి పనిగల్గి పొరుగింటి కేగినావు"?
అనుచు బెదరించు మీవారి యలుక గాంచి
దుఃఖబాష్పాలు లోలోన దొరలునమ్మ!॥

లేనిపోనట్టి ఈ యనుమానములకు
ఐనవారిలో ఈ యవమానములకు
తప్తజీవిత హనన యత్నములు చాలు!
చచ్చి సాధించు కేమిటే! పిచ్చిపిల్ల!॥

దాసీదానికి నీకు భేదమిసుమంతన్ లేదు
విశ్వాస్తమై,
ఆశాసంహారణమ్మవై, విరహబాధావేశ
మాక్రోశమై,
నీసంతోషము ఎండమావులయి యింకెన్
లోతు క్రీగండ్లలో
నీ సింగారము వ్యర్థమై చనియెనే? నిర్భాగ్య
కాత్యాయినీ?॥

కనులుగుట్టెనె? నాల్గు మొగాలవాడు
పచ్చపచ్చని బ్రదుకుపై మచ్చరించి
నిప్పులను జల్లినాడు కానిమ్ము తల్లి,
మారుచున్నవి కాల ధర్మములు నేడు॥

తుడుచుకోవమ్మ కన్నీళ్ళు, ముడుచుకొమ్ము
పుష్పమాలలు,- కుంకుమబొట్టు నింక
దిద్దికోవమ్మ చాలు సందేహమింక
ఎవ్వరేమనుకొన్న నీకేమి చెల్లి?॥

ధర్మముల పేర బానిసత్వమ్ము చాల
సర్వతంత్ర స్వతంత్ర దేశమ్ము మనది
భయము లేదమ్మ గుండె నిబ్బరముతోడ
వెలుగు బాటల నడువు జీవితము చెల్లి.॥

విరహిణి

చక్రపాణి నరసింహారావు

నీచూపులో చూపు
కలిసింది!
నామనసు నీమీద
నిలిచింది!
నీకంటి తళతళల
వెలుగులో నామనసు
ఉయ్యాల లూగింది
ఉప్పొంగి పోయింది.!
నీచూపులో చూపు కలిసింది
నామనసు నీమీదనిలిచింది!

నీరూపు నాప్రేమ
ద్వారాలు తెరిచింది!
నీచూపు నాహృదయ
వీణలను మీటింది!
నీతలపు నాలోన
వలపులై కురిసింది!
నామనసు పొంగింది
నాట్యాలు చేసింది!
నీచూపులో చూపుకలిసింది!
నామనసు నీమీద నిలిచింది!



హైదరాబాదులో

ఆంధ్ర మహిళా సభ భవనాలకు

శంకుస్థాపన

ఆంధ్ర మహిళా సభ హైదరాబాదు శాఖకు ప్రభుత్వం వారు ఇచ్చిన అడిక్మెట్టులోని 4 ఎకరాల స్థలంలో వివిధ శాఖలలో తర్ఫీదు పొందేవారికోసం వసతిగృహాలు మొదలయిన కట్టడాలు నిర్మించ తీర్మానించుకొని అందుకై రాష్ట్ర ముఖ్యమంత్రి అయిన శ్రీ సంజీవయ్యగారిచే శంకుస్థాపన మహోత్సవం జరిపించారు. ఆ సమావేశంలోనే ప్రాంతీయ గృహ పరిశ్రమలలో తర్ఫీదు నివ్వడానికి (Regional Handicraft Training Institute) మరొక మందిరాన్ని కట్టడానికి శ్రీమతి విమలాదేవిగారిచే శంకుస్థాపనము చేయించారు. ఈ అన్నీ 3.25 లక్షల రూపాయల వ్యయంతో, దాదాపు ఒక సంవత్సరంలోపల కావచ్చునని ఊహిస్తున్నామని శ్రీ ముఖ్యమంత్రిగారు సెలవిచ్చారు.

ఈ మహోత్సవసభకు శ్రీ మాడపాటి హనుమంతరావుగారు అగ్రాసనాధిపత్యం వహించారు. ఆహ్వానం మేరకు వచ్చినవారిలో, డాక్టరు సి. డి. దేశముఖుగారు, సంఘసంక్షేమ శాఖామంత్రిణి, శ్రీమతి మాసూమాబేగం గారు మున్నగు ప్రముఖులనేకులుండిరి. ఆంధ్రమహిళా సభ (మద్రాసు) కార్యదర్శులు శ్రీమతి టి. అమ్మాబాయిగారు, టి. జి. హైమవతిగారు, ఎ. సర్వలక్ష్మిగారు కూడా యీ ఉత్సవంలో పాల్గొన్నారు.

ముఖ్యమంత్రిగారి అభినందనలు

శ్రీ సంజీవయ్యగారు మహిళాసభావారు నిర్మించ తలపెట్టిన కట్టడాలకు శంకుస్థాపనచేస్తూ—"మహిళా సంక్షేమ వృద్ధిలో అనేక రంగాలలో వారి కార్యాలను దోహదం చేస్తూ వుండే మద్రాసులోని ఆంధ్ర మహిళా సభను దాని వ్యవస్థాపకురాలైన శ్రీమతి దుర్గాబాయిని హృదయపూర్వకంగా అభినందిస్తున్నాను. మొత్తం జనాభాలో సగంమంది స్త్రీలే అయినప్పుడు వారిని అభివృద్ధికి తెచ్చే అవకాశాలు అన్నీ వుండినా. ఇంకా మనదేశాన

విషయంలో వెనుకంజ వేయటం దురదృష్టం. ఆంధ్ర మహిళాసభ ఈ సంవత్సరంలో అబలాజనాంగానికి చేస్తున్న సేవ అసమానము. ఈ సంస్థ వనితావర్గాల అభివృద్ధి కొరకు చేస్తున్న ప్రతి ప్రయత్నంలోను రాష్ట్రప్రభుత్వం వారివల్ల అయినంతవరకు పూర్తిగా ప్రోత్సాహం ఇవ్వగలము" అని ఉపన్యసించారు.

మద్రాసులోని సభకు వ్యవస్థాపక కార్యదర్శినియు హైదరాబాదులోని శాఖా సభా నిర్వాహక సభ్యులలో గణింపదగిన సభ్యురాలును అగు శ్రీమతి దుర్గాబాయి దేశ్‌ముఖ్‌గారు సభ్యులకు స్వాగతం చెబుతూ, "మద్రాసులోని మహిళాసభ, వయోధికులకొరకు పాఠశాలను, ఒక వసతి గృహాన్ని, పిల్లలకు అగతిక స్త్రీలకు ఒక సంఘసంక్షేమ కేంద్రాన్ని, గృహపరిశ్రమాభ్యాసనసంస్థను, ముద్రణాలయాన్ని, నర్సింగ్‌హోమును, ఆర్థోపీడిక్ కేంద్రాన్ని, నర్సులకు మంత్రసానులకు తరిఫీదునిచ్చే అభ్యాసన సంస్థను కుటుంబనియంత్రణ కార్యకర్తల కార్యాలయాన్ని కొనసాగిస్తున్నది. హైదరాబాదు మహిళా సంక్షేమ కేంద్రంలో ప్రాంతీయ దేశముల తరిఫీదుకాని స్త్రీల విద్యాభివృద్ధికి, అల్పవారికి కాని ప్రజాశిక్షా బోధనాభ్యాసంగాను చెప్పి పనిచేస్తున్నది. నాగరికులైన శిల్ప చిత్రకళలను నేర్పే సంస్థ, వసతి గృహంలోనూ హైదరాబాదు సభ నిర్వహిస్తూ వున్నది. ఇతర ప్రదేశాల్లోను త్వరితంగానే తక్కినవికూడా కార్యక్రమం ఏర్పాటు గలవు" అని చెప్పారు.

ప్రాంతీయ లక్షణం

"మద్రాసు—హైదరాబాదులలో స్థాపింపబడిన సంస్థలు. కేవలం రెండు (మద్రాసు, ఆంధ్రరాష్ట్రాల అవసరాలను ఉద్దేశించినవి మాత్రమే కాకుండా) దక్షిణరాష్ట్రాల కన్నింటికీ ఉపకరించాలని ఉద్దేశింపబడింది. ఇట్టి కేంద్రాలు కలకత్తా, బొంబాయి నగరాలలోకూడా ఉన్నాయి. ఇవేకాక, అబలాజనాభ్యుదయాలయిన యితర సంస్థలును పనిచేస్తున్నవి. వాటికి భారత ప్రభుత్వపు ఆయా శాఖల మంత్రివర్గాలు తగినసాధనాలు, ఉపవత్తులతో పథకాలు నిర్మించి ప్రవేశ పెట్టినవి".

"ఈ సంస్థల వల్లను ఇట్టి కార్యాలవల్లను, మహిళా సభ, మన ప్రధాని శ్రీ నెహ్రూగారికి అత్యంత ప్రియమయిన జాతీయైక్యతను పెంపొందిస్తున్నది"

"రాబోవు సంవత్సరం మేనెల 11, 12, 13—తారీఖులలో మద్రాసులోని ఆంధ్ర మహిళా సభయొక్క రజతోత్సవం జరపాలని నిశ్చయించుకొన్నాము. సభా సభ్యులు పోషకులు మున్నగువారి సంపూర్ణ సహకారం కొన్నివేల వరకు ఉన్నవి. విద్యార్థినులుకూడా చేయూతనిచ్చేటట్లు యున్నట్లు సంస్థలు తెలుపుచున్నవి. అందులో సగానికి పైగా కేంద్ర ప్రభుత్వంవల్ల ఆర్థిక సహాయాన్ని పొందుతున్నాయి"

"ఆంధ్ర మహిళాసభను సంబంధించిన అనేక శాఖలలో తరిఫీదు నొందినవారు ప్రభుత్వం వారిచే గ్రామో




సభ్యాసములు



"ఆంధ్రమహిళాసభ శుభప్రయత్నాలు సాధిస్తోంది"...కమలాదేవి చటోపాధ్యాయ

ప్రధాన కేంద్రాలలోను, తక్కిన సంక్షేమ కార్యకలాపాలలోను పనిచేయడానికి నియమించ బడుతున్నారు"

పరిపాలనా కార్యాలయాలు

"ఈ దినం శంకుస్థాపన జరిగే భవనంలోనే సభాపరిపాలనా కార్యాలయాలు నెలకొల్పడానికి ఉద్దేశించబడింది. ఇందును విద్యా వ్యాసంగాలకు, గ్రంథాలయానికి ఒకహాలు (Hall) ఏర్పాటు నిశ్చయించబడింది. ప్రకృతం 50 మందికి మాత్రమే వసతి గృహంలో సౌకర్యాలు గలవు. అనుకూలాన్నిబట్టి ఇంకొక 100 మందికి ప్రవేశం ఇవ్వడానికి వీలుండగలదు. ఇప్పుడున్న భవనంలో ఇది వరకు నేర్పబడే గృహ పరిశ్రమలు అధికించి నేర్పడానికిన్ని, ఒక ముద్రణాలయాన్ని స్థాపించడానికిన్ని తావున్నది"

మద్రాసు మహిళా సభకు, శాఖ అయిన హైదరాబాదు సంస్థకు—తానిప్పుడు కొనసాగిస్తున్న కార్యాలయాలతో బాటు, ప్రసవాలయం నిర్మించుకోను కూడ స్థాపించి కొందరికి ఉపాధిని ఈయవచ్చును. యీవిధ్వారక కుటీర పరిశ్రమల సంఘం, తగిన హాలర్యంలో పరిశ్రమలలో శిక్షణ ఇప్పటిచేసుకుంటే, తద్వారా ఉత్పత్తులకుకూడ అవకాశం కలిగించాల్సిని నాక్కు చెప్పటంవల్ల పరిశ్రమ సంస్థ శ్రీఘ్రంగానే విస్తరింప చేయాల్సిన అవసరం వున్నది. ఇందుకయి కేంద్ర సంక్షేమ సంఘం 300 లక్షల రూపాయలను ఖర్చుచేయడానికి నిశ్చయించుకున్నది. పరిశ్రమాభివృద్ధి పథకాలను నెరవేర్చడానికి వేలకొలది శిక్షణపొందిన శిల్పాదిక చిత్ర కళానుభవం కలిగి ఉత్పత్తి చేయగలవారు ఈ పరిశ్రమలకు ఎక్కువ ముఖ్యంగా కావలసివస్తున్నారు".

"ఈ సభా కార్యావసరాలకు అనుకూలించే భవనాలు నిర్మించడానికి తగిన స్థలాన్ని సమకూర్చిన ముఖ్యమంత్రి, శ్రీ దామోదరం సంజీవయ్యగారికి కృతజ్ఞతాభివందనాలు"

అని ఉపన్యసించారు. తరువాత శ్రీమతి కమలాదేవి చటోపాధ్యాయగారు ఇలా వక్కాణించారు :

"రాష్ట్రంలో కుటీర పరిశ్రమలు ప్రశంసింపదగిన విధంగా అభివృద్ధి చెందేటట్లు మిక్కిలి వుదార స్వభావంతో ప్రవర్తిస్తూ వున్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాన్ని హృదయపూర్వకంగా అభినందిస్తున్నాను.

"అవిరామంగా, ఉత్సాహ పూర్వకంగా నాయకత్వం వహించి పనిచేస్తున్న శ్రీమతి దుర్గాబాయి ప్రోత్సాహం క్రింద ఆంధ్ర మహిళాసభ ఘనమైన విజయాలు సాధిస్తోంది. ఆంధ్ర మహిళాసభ భవనాలు జాతికి గర్వకారకమైన చిహ్నాలు. అందుల కీసంప్రదాయక మయిన శంకుస్థాపనోత్సవ కార్యమే నిశ్చయంగా ఒక శుభ చిహ్నము"

కుటీర పరిశ్రమల సమస్య

"దేశంలోని గృహపరిశ్రమల విషయంలోసహజంగా తటస్థించే కష్టములు చాలా వున్నవి. కాని ఆవి అట్టి పరిశ్రమలచే తయారగు వస్తువుల వ్యాపారంలోగాక సక్రమంగా ఉత్పత్తి, కాకపోవటంలోనే సంభవిస్తున్నవి. ఈ సమస్యా పరిష్కారానికి మార్గంలేకపోలేదు. ఉత్పత్తి, వ్యాపారం ఈ రెంటిని సమానపరచే సరియైన సంస్థ వుండాలి. పలురకాలు, పెక్కు కల్పనలు నేర్చి, చక్కని తరిబీతు పొందిన సమర్థులు వుత్పత్తులకు, పూనుకోవాలి. ఈ రెండూ ఒకదానిమీద ఒకటి ఆధారపడింది"

కుటీర పరిశ్రమలకు చాలినంత ముడిపదార్థాలు సరిగా లభించక పోవటం గొప్పలోపమని ప్రభుత్వాధికారులు గుర్తించాలి. పైగా, తమ శిల్పనైపుణ్యాన్ని ప్రదర్శించే పనివారిని దినసరి వేతనాలతో నియమించక యే అర్ధదినానికో, కూలికి ఉంచుకొని పనిచేయించుకోవటంవల్ల, వారిగుండా విలువగల కుటీరపరిశ్రమలు తయారుచేయించుకోవటం దుర్లభం. అనగా, నిలకడలేని అల్పకాలిక మయిన తమ ఉద్యోగం, మొత్తంమీద 10 దినాలు మాత్రమే కావచ్చును. ఆ పదినాళ్ళ ఆర్జనతోనే ఆ నెలలోని తక్కిన 20 దినాలు గడవటం కష్టమయినందువల్ల, నెల పొడుగున కుటుంబభరణానికి కావలసిన డబ్బును 10 దినాల పరిశ్రమతో సంపాదించాల్నని చూడటం సహజం. అట్టివారు తమ పనిలో కళానైపుణ్యం చూపటానికి గాని, ఎక్కువగా కుటీర పరిశ్రమలలో ఉత్పత్తి చేయటానికిగాని అవకాశం వుండదు. ఈ పరిశ్రమలు వంశపరంపరగా చేసేవారికి, కొత్తగా నేర్చుకోవటానికి చేరేవారికి తగినంత ప్రోత్సాహం సహకారం కలిగించే యెడల శాశ్వతంగా వుండే మేలిరకం వస్తువులను ఉత్పత్తి చేయగలరు. అవే ప్రత్యేకంగా వుత్తమమైనవని యెంచబడుతుంది.

తరువాత శ్రీ హనుమంతరావుగారు, శ్రీమతి దుర్గాబాయికీ ఆంధ్ర మహిళా సభకూ అభినందనాలు చెల్లించటంలో తానుగూడ తక్కిన వారితోబాటు పాల్గొంటున్నానని సెలవిచ్చారు. శ్రీమతి లీలాగౌరీబాజి హైదరాబాదు మహిళా సభకు సంబంధించిన సంగ్రహ కార్యనివేదికను చదివారు. శ్రీ సి. జి. ఎయిరేగారు, అధ్యక్షులు డాక్టరు-ప్రసాదు, ఉపాధ్యక్షులు డాక్టరు రాధాకృష్ణన్, గవర్నరు భీమ్‌సేన్‌సచారు తదితరులు అయిన ప్రముఖులంపిన శుభసందేశాలను చదివారు.

మద్రాసు మహిళా సభా కార్యదర్శిని శ్రీమతి పర్వతవర్ధనిగారు హైదరాదుబాదులోని సభాశాఖకు రు 35,000 విరాళమిచ్చేటట్లు సభలో వెల్లడిచేశారు.

అనంతరం శ్రీ సామ్రాజ్యలక్ష్మిగారు వారి బృందం నాట్య ప్రదర్శనం యిచ్చి సభాసదులకు మహదానందం చేకూర్చారు. ఆంధ్ర బాలానంద సంఘము సభ్యులు వినోద ప్రదర్శనం జరిపి పెద్దల మన్ననల పొందారు. సంయుక్త కార్యదర్శిని అగు శ్రీమతి సుగుణమణిగారి సభాభివందనాలతో జయప్రదంగా కార్యక్రమం ముగిసినది.

"కడుపు దించుకొన్న కాంత నవీనంపు
గళలఁ దళుకు బెళుకుఁ గలిగియున్న,
నేఁటి నాగరకులు నీటులకుప్పొంగి
పెండ్లియాడి వెనుక వెతలఁ గంద్రు"

(ఆర్యవాణి)

సత్కవీ!

శ్రీ పండిత నారు నాగనార్య

రాజమాత్రుఁడతఁడు కవి–రాజు వీవ,
వానికెవియుండు నవి నీకు– వఱలుచుంట
నతనికిని నీకు భేదమిం–త యిన లేదు.
కొన్నిటను వానికంటెను– గొప్పనీవె!॥

వాని యఖండరాజ్యవిభ.
　వంబునకంటెను నీవిశాల వి
జ్ఞాన నిధానకావ్యములె–
　సర్వజగంబు నుతింపఁజెల్లు, న
వ్వాని యలంతిపేరు సరి
　వచ్చునె సుంతయుఁ? గాలదోషముం
బూనని త్వద్యశః ప్రచుర–
　భూతికి సర్వజగద్వినీతికిన్॥

ఆయుధాగారమున గల–వతనికెన్నొ,
ప్రాసములు గాని నీకు సా–వాసమవ్వి,
వానికిం గల్గునవి యెల్ల– వఱలునీకు,
రాజు కవిరాజు నొక్క–తరమ్మె వారె!॥

చంపకోత్పలములు వన–సమితి నమరు
రాజునకు, నీకొ? కలమెత్తి–వ్రాయఁ దొడఁగు
నపుడ, వేవేలు పడియుండు నంతికమున
రాజుకంటెను నీవె! క–రమ్ము హెచ్చు,॥

పెంచినవితప్ప మఱియొండుఁ– గాంచఁ గలఁడె
నృపుడు, నీవేది తలఁప సృష్టింతువపుడ
బహుళ సుందర మృదుల పుష్ప–ముల గముల
నింకఁ గవిచంద్ర, నిన్నుప–మించుటెట్లు?॥

రాజునకు యతిరాజు ల–రణ్యమందుఁ
గలరు! నీకన్న నడుగులో–పలనె కలరు,
వినరు రాజాజ్ఞ యతివరుల్ వేఁడుకొలఁది,
నీవుతలఁచిన చోటనే నిలచియుంద్రు॥

మదకరి శార్దూలమ్ములు
వొదలాడు నరణ్యములను. భూపతి, కిఁక నీ
యెదవిప్పి కలమువట్టిన
నెదురన్ సభఁదీరు నవ్వి. భృత్యులవోలెన్॥

కోశమున నుండు తేనికే-కొన్ని మణులొ
గాని, కలమెత్తనగు మణి–గణనికరము
కుప్పలుగఁ ద్రోయవచ్చు నీ–కొలఁదిఁ బలుక
రాజునకు సామ్యముం జెప్ప–రాదు సూవె॥

అది! యిది! యని పొల్పఁగ నె
ట్లొదవు ధరారాజ్యమొకటి–యూనము దప్పన్
త్రిదివమ్ముదాఁక నీదవు
సదమల కవితా స్వతంత్ర–సామ్రాజ్యమెకా॥

రాజునానతి దప్ప నే–రమ్మొకండె
కాని, నీయాజ్ఞ దప్పుచో,! గతులుఁగలవె?
మానవులకింకఁ ద్వత్ప్రవి–జ్ఞానశక్తి
జీవితాంతము రక్షఁగా–వించు నిజము॥

ప్రభునిమాటలు వినరు సే–వకులుఁగూడ
విందురెందును మందులేన్–వీనులొగ్గి,
నీ యమోఘ వచస్సున– కేయఖండ
మహిమయున్నదొ! పలుక, సామాన్య మగునె॥

కవికిఁగల ప్రజ్ఞయే శాస్త్ర–కారునికిని
గలుగమిన్ నిత్యనైమిత్తి– కములయందు
నెడనెడన్ గవిసూక్తులే– యడరుచుండుఁ
గవియెఱుంగని లోకసంగ్రహముఁగలదె॥

మానవులకేవి? వివిధసా–మాన్య శస్త్ర
వస్తుసముదయమలరు, నృ–పతుల కవ్వి
కలుగు గష్టార్జనమ్మున–గాని, కవికి–
బుద్ధిబలమున దానంత– పొంగి పొరలు॥

సృష్టికిం బ్రతిసృష్టిఁ గ–ల్పించు నెవ్వఁ
డొక్క–కవిదక్క– యితరుల–కుండుటరిది?
యద్ది, సామాన్యమగు కార్య–మా! తలంపఁ
బ్రభవమగు నెన్నొ, త్వన్మనః–పరిధియందు॥

కవివరా! మున్ను వాల్మీకి–వవుట, రాము.
దేవునిగ దిద్ది తీర్చి ను–తించినావు,
నీవులేకున్న రాముండు– దేవుఁడెట్టు
లగును? నీవన నిర్మాత–వగుదు వెపుడు॥

రవియొకండీవొకండ వీ–భువి సతమ్మె
వెలుఁగుఁగలిగింపఁదగుదు రా-వేవెలుంగు
కంటికిన్ వెల్గుఁగూర్తువు- కవివి, నీవొ?
బుద్ధికిన్ వెల్గుఁగూర్తు వ-బ్బురముఁ దోఁప॥

గడ్డిదిని పాలొసంగు గో-గణమునట్లె,
కష్టములువొంది లోకసం-గ్రహముఁగూర్తు
వట్టినిన్ను జగమ్మె గు ర్తింపకునికిఁ
గాపురించునె? నీపీటఁ-గలిమిబోటి॥

సృష్టికర్త, కలండని- చెప్పుచుంద్రు
గానరాడేరి కదియేమి- కారణమ్మొ?
సందియములేక, యెదుర సాక్షాత్కరించు
కవియొకఁడె కానఁబడు- సృష్టికర్త యనఁగ॥

రాజుకంటెను నోకవి-రాజ! నీవె!
మిన్నవయ్యు, నొకపేని-మిడిసిపడవు.
అకట! రాజ్యపుఁబోలిమేర-లైన దాటి
చనని పేర్గలవేండ్ల. నేమని వచింతు॥

ఏవి? నీకుండవంచు భావించుటగునొ?
సకలవిధములఁ జూడ జేనికవి కొలఁది
యైనఁ బొలుపారుట హుళక్కి- యగును జూవె
యిదియ, లోకానుభూతి సహేతుకమ్ము!

నవతా కవితా శక్తిని
భువికాదు, దివమ్ముగూడ. బుధనుత దివ్యా
ద్య విరళరూపముఁ గల య
ట్లపురా! సృజియింపనేర్తు, పరమున సుకవీ॥

ఋతువులు - బ్రతుకులు

శ్రీమతి పద్మావతీ గంగాధర్

వర్షాకాలం వచ్చిందా ?
వానలు కురిసి !
వాగులు పొంగి !
వరదలు వచ్చి

ఇళ్ళూ వూళ్ళూ కొట్టుకుపోతే !
పాడిపంటలు పాడైపోతే !
పేదవాళ్ళకు నీడెక్కడిది ?
చిట్టిపాపకు పాలెక్కడివి ?

వసంతకాలం వచ్చిందా ?
పచ్చ పచ్చగా !
ప్రపంచ మంతా— !

కిల, కిల, మంటూ !
కళ కళ లాడుతు !
కమ్మని కోయిల !
గానముఖోటి !

తుమ్మెద రాగం :
మేళవింపగ !
నాట్యంచేస్తూ వురటుందా ?
బ్రతుకే హాయిగ వుంటుందా ?

వేసవికాలం వచ్చిందా ?
మండే ఎండలు !
రాలిన ఆకులు !
మోడు చెట్టులు !
ఎండిన వాగులు !
దుమ్ము, దుమారం !
మాగిన బ్రతుకులు !
మాడిన ఆశలు !

వేసవికాలపు వింతచేష్టలా !
మోడుచెట్టులు పచ్చబడునుగా !
ఎండినవాగులు నిండిపొంగుగా !
మాడిన ఆశలు మొలకలెత్తుగా ?

"ఎఱుక గలవారిచరితలు
గఱచుచు సజ్జనులగోష్ఠిఁ గదలక, ధర్మం
బెఱుఁగుచు నెఱిఁగినదానిని
మఱువ కనుష్ఠించునది సమంజసబుద్ధిన్"

(మహాభారతము)

సామాన్యులకు :

గీతా సందేశం

శ్రీ వి. ఆర్. రావు.

(మూలరచయిత : శ్రీ- కే. ఆర్. కే. భట్టుగారికి కృతజ్ఞతతో)

భగవంతుడు కాలాతీతుడు :
సర్వాంతర్యామి : విశ్వమయుడు.
లీలామానుష రూపుడు.

ప్రాణికోటి జీవించి నశించటం తిరిగి జీవించటం అయన లీల. అది మనకు అర్థంకాని గోల. ఈ గోలనే లీలగా చూడాలంటే జ్ఞానం అవసరం. జ్ఞానాన్ని జ్ఞానుల నుంచే పొందాలి. ఏదైనా ఒక విషయం అర్థం చేసుకోటానికి ఒక పట్టుదలే కాదు. అందులో గట్టినమ్మకం కూడా అవసరం.

భగవల్లీలా విశేషమే ఇది: ''నమ్మి చెడినవాడు లేడు''. అయితే 'నమ్మకచెడిపోయినవాళ్ళు' చాలామందివున్నారు.

జగదీశ్వరుడు అందరిలో వున్నా కొందరికే అవుపిస్తాడు. ఆకొందరినే జ్ఞానులంటున్నాం. పిల్లగాలివలె భగవత్సాన్నిధ్యాన్ని అనుభవించాలి.

సృష్టిలయాల వలయంలో తిరుగుతున్న జగన్నాథ రథం-ఈ ప్రపంచం.

ప్రపంచ రథసారథి-పార్థసారథి.

''ధన్వంతరి నారాయణో హరిః'' మందుల్లో భగవంతుని కృపారసాన్ని సేవిస్తున్నాం.

''అన్నం పరబ్రహ్మ స్వరూపం'' ఆయన స్వరూపాన్ని రోజూ కరగ తింటున్నాం. కాని, ఆయన తరుగని సిరి. మన అనుభవాల్లో, ఎండవేడిమిలో, అగ్నితాపంలో, వర్షపాతంలో అన్నిట్లో తానై మెలుగుతున్నాడు.

ఈ ప్రపంచమంతా భగవంతుడికి ఒక క్రీడారంగం.

'ఆత్మ' అనేది ఆ పరమాత్మని పరమాణు స్వరూపం. ఈ ప్రపంచం ఆయనకు క్రీడారంగం అయినట్లు మనం ఆత్మకి ఉనికి పట్టు కాగలం.

భగవంతుడు ప్రపంచానికి ఆత్మ.

మనం ఆత్మకొఅకు నిర్మించిన ఒక ప్రపంచం.

దేహంవేరు, ఆత్మవేరు, రెండూ వేరు చేసుకోవచ్చు. ఎలా వేరు చేయవచ్చో తెలుసుకోటమే జ్ఞానం.

ఈ ప్రకృతి భగవంతుని శక్తి యొక్క బాహిరాకృతి. ఇందులో మనస్సు శరీరం అనే సంయోగ పద్ధాలున్నాయి.

భూమి, నీరు, నిప్పు, ఆకాశం, మనస్సు, గాలి. జ్ఞానం-ఇలాంటివన్ని కొన్ని ప్రకృతి అంశాలు. అలాగే సత్వగుణం, తమోగుణం, రజోగుణం ప్రకృతి. పురుషుడు-వీటి కలయికే ప్రకృతి.

ఆత్మ నశించదు. ఒక గూటినుంచి మరొక గూటికి ఎగిరే పక్షివలె, ఒక దేహాన్ని వదిలి మరొక దేహాన్ని ఆశ్రయిస్తుంది.

మనస్సు ప్రకృతినుంచి పంచేంద్రియాలను లయించుకొన్నది.

అందలం ఎత్తినందుకు ఒకడు ఆత్మను కోల్పోడు. అందులో ఎక్కినంతనే ఆత్మను బంధించుకోలేడు. నీటిలో కనిపించినంతమాత్రాన చందమామనీలి నింగిది కాకపోదు.

అధర్మాన్ని అణచి ధర్మాన్ని నిలపటానికి, దుష్టుల్ని శిక్షించి శిష్టుల్ని రక్షించటానికి, చెడును నిర్మూలించి మంచిని పెంచటానికి భగవంతుడు మరిమరి అవతరిస్తుంటాడు.

''ధర్మసంస్థాపనార్థాయ సంభవామి యుగేయుగే''

సూర్యచంద్రుల్లోని వెలుగు వెన్నెలలు ఆయనే. ఓంకారనాద స్వరూపుడు ఆయనే.

భగవంతుడు లేనిచోటు లేదు.

ఆయనకు తెలియక ఏమీ చేయలేము.

కాని, ఆయన్ని చూడాలంటే, జ్ఞానం సంపాదించాలి.

మానవుడి 'ఎక్స్-రే' కళ్ళు ఆయన్ని కనుక్కోలేవు. శ్రద్ధాంజలికి మాత్రమే బద్ధుడు. జ్ఞాన చక్షువు తెఅచేవఅకు ఆయన కనిపించడు.

జ్ఞానం ఎలా సంపాయించాలి?

ఆత్మ అమరం.

నశించేది దేహమే.

ఆత్మచావదు. దానివల్ల ఇతరులకు చావురాదు.

—అంటే నిరపాయకరమైనది ఆత్మ అని అర్థం. ఆత్మ అనేది సృష్టిలయాలకు అందని ఒక అందం. అందని అందాన్ని తలపోసి ఆనందించటం కద్దు. మనుషులు చిరిగిన దుస్తుల్ని వదిలినట్టు, మనలన్ని ఆత్మ త్యజిస్తుంది.

వెంటనే కొత్తబట్ట తొడిగినట్టు, ఇంకొక శరీరంలో ప్రదీపిస్తుంది.

ఆత్మని శస్త్రం తాకలేదు. అగ్ని కాల్చలేదు, గాలి గాలించలేదు. నీళ్ళు తడపలేదు. ప్రతిమనిషికి పుట్టుక, దానివెంట చావు, ఆ తర్వాత పుట్టుక, తప్పని సరి. చక్రంలోని కక్ష్యలవలె పర్యాయ క్రమంగా ఈ స్థితులు రెండూ రాకతప్పదు,

కాబట్టి, మనిషి పుట్టటం గిట్టటం వెలుగు నీడలుగా భావించాలి. అలా గ్రహించటం అవసరం.

చావుకు దుఃఖించి, పుట్టుకకు పొంగటం అజ్ఞానం. జననంలో కాక మనుగడను అనుసరించి ఆత్మస్వరూపం ఏర్పడుతుంది. చావువల్ల అది తిరిగి విడుదలౌతుంది.

ఆత్మ చావువల్ల నిగూఢమై జన్మమెత్తిన తర్వాత వెల్లివిరుస్తుంది.

సుమపరాగ పరిమళాలు గాలిలో తేలి లీనమైనట్లు మరణానంతరం ఆత్మకూడ ఇంద్రియజ్ఞానాన్ని, మనస్సును లాగి 'పరకాయప్రవేశం' చేయగలదు.

కర్తవ్యం నిర్వర్తించమని ప్రాణికోటిని సృష్టించి వదిలాడు భగవంతుడు. మనిషికి స్వధర్మం అన్నది వున్నది. దాన్ని భగవంతుడు ఆతడి గమ్యంగా నిర్మించాడు. కాబట్టి, మనిషి స్వధర్మాన్ని కాదని మరే ఘన కార్యం చేసినా రాణించడు. స్వధర్మనిర్వహణలో చచ్చినా మనిషి జీవించి వున్నట్లే, ఆ స్వధర్మాన్నే త్యజించి జీవించటం మరణంకన్న హేయం.

తన ధర్మం తాను నిర్వర్తించే వాడికి సుఖదుఃఖాలు లాభనష్టాలు, జయాపజయాలు సరిసమానాలు.

మానవుడు కోర్కెల సంకెళ్ళనుంచి విముక్తుడవాలి. అలా కానంతవరకు అతను వేసేవి తప్పటడుగులు అనుకో. చిత్త వ్యభిచారాన్ని నిగ్రహించి ఏకాగ్రతకి దత్తం అవాలి.

ఎప్పుడూ కర్తవ్యం నిర్వహించటం నీ వంతు.

ఫలసిద్ధి భగవంతుడిది అనుకో. నిష్కామకర్మ నిర్విరామంగా చేయటమే జీవితలక్ష్యం అనుకో.

అప్పుడే ధన్యత చేకూరుతుంది.

తానొకటి తలిస్తే దైవం మరొకటి చేస్తాడు. అయినా కలత చెందకూడదు.

అందుకే నిష్కామకర్మ చేయాలి. అలాకాక 'ఏమౌతుందో' అనుకోవటంవల్ల ప్రయోజనం ఏమిటి? మన స్థైర్యం కోల్పోటం తప్ప-

స్వలాభానికి పాటుపడుతున్నంత కాలం శోకం తప్పదు.

నిష్కామ కర్మకు పూనుకొనేముందు నీసర్వం భగవంతుడి పరం చేయి. నీహృదయాన్ని, మనస్సును, ఆయనకు నివేద్యంగా పెట్టు. నీవు నేను అన్న పదార్థం (అహం)కాదనుకో.

అప్పుడే జ్ఞానోదయం అవుతుంది. మనస్సు నిగ్రహించి, భగవంతునిమీద లగ్నం చేయగలిగినవాడు-

నీకు శోకంలేదు; కోపంరాదు.

దురాశకు దూరమవుతావు.

మోహం మొహం చూపించదు.

శాంతము సౌఖ్యము పొందగలవు.

మనఃస్థిమితం, మనోధైర్యం నిగ్రహం లభిస్తాయి,

ఇవి లభిస్తేనేగాని, ఆలోచించగలశక్తి రాదు. నిమ్మళంగా ధ్యానించ గలిగినప్పుడే జ్ఞానోదయం అవుతుంది.

త్యాగపూరితమైన యోగంవల్ల లోకకల్యాణానికి కారకుడవు అవుతావు.

పరులకొఱకు పాటుపడతావు. అంతా నీవారవుతారు, మానవసేవే మాధవసేవ:- అందులోనే మనిషికి జన్మ సాఫల్యం.

కాబట్టి, స్వధర్మ నిర్వహణ సర్వమంగళాలకు కారణభూతం. అదిఎంతఅల్పమైనా, అసంపూర్ణమైనా నిండుమనస్సుతో స్వీకరించు. లేకుంటే, ఆత్మద్రోహం అవుతుంది. వినాశానికి దోహదం అవుతుంది.

మానవుడికి మనస్సు గొప్పది.

మనస్సుకంటె గొప్పది ఆత్మ.

స్వధర్మం సంతుష్టి నిస్తుంది.

సంతుష్టి సంతారకమార్గం చూపిస్తుంది. భగవద్ధ్యానంలో నిమగ్నుడైనవాడు. తనప్రతిచర్యలో భగవంతుణ్ణి చూస్తాడు. భగవద్ధ్యానం అంటే ప్రార్థన. ప్రార్థన పలురకాలు. ప్రతిప్రార్థనకీ అర్థం వున్నది.

మనస్సును నిగ్రహించి ఏకాగ్రత——

అంటే ఉగ్రతపస్సు కావచ్చు;

నిరంతర ధ్యానం కావచ్చు.

ఇవి జ్ఞాన భక్తి యోగాలు. ఇదొకమార్గం. అలాగే స్వధర్మ నిర్వహణ నిష్కామకృతమైతే కర్మయోగం అవుతుంది. ఇది రెండోమార్గం.

ఈ రెండు ఒకేగమ్యానికి తీసుకొనిపోగలవు.

భక్తిశ్రద్ధలు దైవసన్నిధికి సుగమమార్గాలు. కర్మయోగి పంచేంద్రియాలు లాగే రథంలో ప్రయాణం చేస్తాడు. గుఱ్ఱాలు మాట వినవు, బాట సరిగా నడవదు.

కాని, ఎలాగైనా గమ్యం చేరాలి. భగవంతుణ్ణి మనం మరువనంతకాలం మనల్ని ఆయన మరువడు.

అందుకు మనస్సును నిగ్రహించాలి. నిగ్రహశక్తి చలించని దీపకళికవంటిది.

ఈశ్వరుడు ఒక్కడే, ముక్కోటి దేవతలు మానవ మస్తిష్కంలో విరిగిన ఇంద్రధనస్సు. అది పలురంగులు.

మంచిపనులు కర్మబంధాల్ని సడలిస్తాయి. తమస్సు నుంచి జ్యోతివైపు నడిపిస్తాయి.

భగవంతుడు భక్తవత్సలుడు. ఆయన భక్తిస్వరూపం భక్తులంటే ప్రాణం. భూతదయ ప్రేమ మనిషి అర్థం చేసుకోవాలి. అప్పుడే సేవాధర్మం, తత్పరత అతనిలో ఏర్పడతాయి. ఏర్పడినట్లయితే, మానవత్వానికి వున్న అర్థం నిరూపణమయిందన్న మాట,

అలాంటి నిజమైన మానవుని ఏదేవుడు ప్రేమించడు? గుణాతీతుడైన. మానవుడికి ఆత్మస్వరూపం అర్థమైనట్లే. ఆత్మ పరమాత్మయొక్క సూక్ష్మరూపం. మానవసేవాధర్మం తెలుసుకొని ఆచరించటం దేవుణ్ణి అనుసరించటమే.

ఆయనేమీ నిద్ర పోవటం లేదు.

"మాధవసేవే మానవసేవ"

ఓం శాంతి:

ఏడుకొండలవాడ

శ్రీమతి కవుల లక్ష్మీనరసమ్మ

ఏడు కొండల వాడ
వెంకట రమణా!
అలక మాని నీవు
పలక వేమయ్యా! ॥ఏడు॥

మదిలోన దాగిన
మాదు కోర్కెలనన్ని:
మ్రొక్కుకుంటే చాలు
చక్కగా తీర్చెదవు! ॥ఏడు॥

నిన్ను నమ్మినవారు
ఎన్నటికి చెడిపోరు!
నిన్ను కొలిచిన వారు
నీ కరుణ పొందెదరు! ॥ఏడు॥

వడ్డి కాసులవాడ
వైకుంఠవాసా!
అడ్డుపడి అపదలో
ఆదుకొని రక్షించు! ॥ఏడు॥

శక్తి కొలది నిన్ను
భక్తితో కొలువగ!
మెచ్చుకొని భక్తులకు
మోక్షమొసగు తండ్రి! ॥ఏడు॥

వేలాది జనులు నిన్ను
విరివిగా దర్శింప!
తిరుపతి క్షేత్రాన
తేజముతో వెలిగేటి! ॥ఏడు॥

నిన్ను తలవని వారు
నిన్ను కొలువని వారు!
ఎక్కడను లేరయ్యా
యీ పుడమియందు! ॥ఏడు॥

అమృతాంజనము

అన్ని నొప్పులకు దివ్యామృతము

1893 నుంచి లక్షలాది ప్రజలు అమృతాంజనం వాడి, ఎంత అమోఘమైన శక్తి కలదో తెలుసుకుంటున్నారు. అమృతాంజనంలో వాడే ఔషధాలన్నీ అతి శీఘ్రంగా బాధను పశమింప చేయుటయేగాక చాలా హాయిని కూడా కలిగిస్తాయి. హాని కలిగించే పదార్థాలేమీ లేవు కూడా. దగ్గు, జలుబు మొదలైనవి కూడా శీఘ్రంగా ఉపశమిస్తవి. అమృతాంజనం దగ్గర ఉంటే మీ రెటువంటి బాధనైనా జయించవచ్చు!



అమృతాంజన్ లిమిటెడ్,
మద్రాసు-4
బొంబాయి-1.
కలకత్తా-7

AL-87-1 TELUGU

అసమర్థుని జీవయాత్ర

శ్రీ నరిశేపల్లి లక్ష్మీనారాయణ

నాగభూషణం పరీక్షాఫలితాలు ఆరోజు పేపర్లోవచ్చాయి. బి. ఏ. సెకండ్ క్లాసులో పాసయ్యాడు: కొడుకు తెలివితేటలకు జోగయ్య మురిసిపోయాడు. "నాన్నా! నేను పరీక్ష పాసయ్యాను." జోగయ్యకు ఎదురుపడి తలవంచుకుని నెమ్మదిగా పలికాడు భూషణం. అంతకంటే ఎక్కువగా ఏమి మాటాడలేదు, మాటాడాలనుకున్నా, ధైర్యంచాలక ఆప్రయత్నం విరమించుకున్నాడు;

"తెలసింది: సంతోషం." ఈసందర్భంలో కూడ జోగయ్య కొడుకుతో ముభావంగా మాటాడాడు.

మధ్యాహ్నం భోజనాలయ్యాక జోగయ్య ముందు హాలులో రేడియో పాడుతున్న సంగీతస్వరాలను వింటూ కూచున్నాడు; మధ్య మధ్య పండ్రెండేళ్ళ బుచ్చిబాబు తన క్లాసుపుస్తకంలోని ఓపాఠం తాలూకు సందేహాలనుగూర్చి అడుగుతున్నాడు. వాటికి సమాధానం చెప్పాల్సొచ్చినపుడల్లా జోగయ్య రేడియోశబ్దాన్ని తగ్గిస్తున్నాడు; కొంతసేపటికి ఆదిలక్ష్మమ్మ పనియుగించుకొని చీరకొంగుతో చేతులు తుడుచుకొంటూ వచ్చింది. జోగయ్య రేడియోఆపి "ఒరేయ్ బుచ్చి, అన్నయ్య మేడమీద ఉన్నాడేమో, నే పిలుస్తున్నానని చెప్పు" అని అన్నాడు; అనటమే తడవుగా బుచ్చిబాబు రామబాణంలాగ మెట్లెక్కి మేడగదిలోనికి దూసుకుపోయ్యాడు; వాడిఉత్సాహానికి దంపతులు ఒక్కమారు చిన్నగా నవ్వుకున్నారు; "పిలచారట!" భూషణం పలికాడు అతివినయంగా.

"అదే, పెళ్ళివిషయంలో నీవు ఏనిర్ణయానికొచ్చావో తెల్సుకుందామని" జోగయ్య పలికాడు భార్య ఆదిలక్షుమ్మ అందించిన తమలపాకుచిలకను అందుకొని.

"నేను ఎం. ఏ. చదవాలనుకున్నాను; ఎల్లాగూ తెలుగు ద్వితీయశ్రేణిలో పాసయ్యాను. వాల్తేరులో సీటుకూడ దొరుకుతుంది. "నాగభూషణం నసిగాడు" తన అంతరంగంలోని "అప్పుడే పెళ్ళికి తొందరేమిటి?" అన్న తనభావాన్ని ప్రకటిస్తూ; "ఆ: ఎంతచదివినా తెలుగు లెక్చరర్ పనికేగా; ఉన్న ఆస్తిపాస్తులు సక్రమంగా చూచుకుంటే ఆ అయ్యవారి జీతంకంటే ఎక్కువే వస్తుంది. ఆరోజుల్లో మేము ఏంచదివామని; ఐనా ఈనాడు నేను రెండుచేతుల్తో సంపాదించగలుగుతున్నానంటే అదంతా అదృష్టం" జోగయ్యపలికాడు అన్యాపదేశంగా. "చదివిందేదోచాల్లే; కాని ఆస్తిపాస్తుల వ్యవహారాల్లో దిగి కాస్తో కూస్తో అనుభవం గడించుకో" అన్న సలహానిస్తూ. ఈమాటలకు ఏమని బదులు చెప్పాలో ఆసమయంలో నాగభూషణానికి తోచలేదు; బాల్యంనుండి భయంవల్ల నాన్నగారి ఎదుట ఎన్నడూ మనస్సువిప్పి మాటాడలేదు' ఏమంటే ఏమంటాడోనన్న దృక్పథం అతనిలతలాగ అంటిపెట్టుకొని, ఈనాడు త్రుంచటానికి వీలుకానంత బలిష్ఠమైపోయింది. పైపెచ్చు తనవిద్యాభ్యాసంకూడ తల్లిదండ్రులకు దూరంగా పట్టణంలో సాగిపోవటం ఆభయానికి ఒక కారణమైంది: "నాన్నా. ఉన్నతచదువులు చదవటం కేవలం ఉద్యోగాలకూ, ధనార్జనకేనా? విజ్ఞానానికని ఎందుకనుకో కూడదు? సాహసించి అడిగాడు భూషణం;

భూషణంమాటలకు జోగయ్య కించిత్తు ఆశ్చర్యం పొందాడు: "భేష్, భేష్. ఏనాడు తనసమక్షంలో నోరుతెరిచి ధైర్యంగా మాటాడనివాడు ఈనాడు విజ్ఞానంకోసం ఉన్నతచదువులు, అన్న ధోరణిలో మాటాడుతున్నాడంటే ఇదంతా చదువుప్రభావమే: ఇంకా చదివిస్తే మతిభ్రమణంచెంది ఉన్నమతి పోతుందేమో" అని అనుకున్నాడు జోగయ్య స్వగతంగా;

"నాగభూషణం! విజ్ఞానంకోసం పైచదువుల కెళ్ళటంలో తప్పులేదు; ఈచదువులు నీకు ఎంతైనా విజ్ఞానం కలుగచేయవచ్చు, కానీ బ్రతుకుబాటలో సాఫీగా ప్రయాణంసాగించటానికి అవసరమైన ప్రపంచజ్ఞానాన్ని చదువులు సరఫరా చేస్తాయంటే నేను ఒప్పుకోను; లౌకికవ్యవహారాల్లో అడుగెట్టి పదిమందితో మాట్లాడుతుంటే కాని జీవితానుభవం; లభ్యంకాదు: అన్నట్టు గుంటూరుప్లీడరు రామనాథంగారు తమ అమ్మాయిని ఇస్తామని నిన్న ఉత్తరం వ్రాశారు. అమ్మాయి బి. ఏ. చదువుతోందట. పాతికవేలదాకా ముట్టచెబుతారు. ఇక మనం వెళ్ళి పెళ్ళిఖాయపర్చటమే తరువాయి. ఏమంటావ్?" అడిగాడు జోగయ్య భార్యవంకచూచి, "నీవూ రెండుముక్కలు వల్లించు" అని అన్నట్టు.

"అవున్రా భూషణం!" ఇంక ఎంతకాలం ఈచదువు? అమ్మాయి కొంతనలుపేనన్న మాటేకాని, ముఖంలో లక్ష్మీదేవికళ ఉట్టిపడుతూంటుందట; అన్నట్టు గుణం ప్రధానం కానీ, రంగులో ఏముందిరా; ఈసంబంధానికి అంగీకరించి మా అభిలాష." ఆమెవాక్యం పూర్తిచేయకముందే "అమ్మా నాకిప్పుడే పెళ్ళి అక్కర్లేదు, చదవాలనుకున్నాను. ఇంకా చదువుతాను, పెళ్ళితో నాకిప్పుడేమీ అవసరంలేదు; ఇది నాకు నేనే నిర్ణయించుకున్నాను":

"భూషణం, ఎప్పటినుండి నేర్చుకున్నావ్, ఈస్వయంనిర్ణయాలు; ఏదో చేస్తావని కొండంత ఆశపెట్టుకుంటే చివరకు ఇదా నీనిర్ణయం, కలిసివచ్చే అదృష్టాన్ని కాలదన్నుకుంటావట్రా. మాకు ఈసంబంధంనచ్చింది; తరువాత నీఇష్టం: నీచిత్త మొచ్చినట్టు, నీఅంతరాత్మ ప్రబోధించినట్టు ప్రవర్తించు: నామాటదాటక." ఖంగుమనిమ్రోగుతున్న జోగయ్యకంఠం "నాన్నా" అన్న భూషణం కేకతో ఆగిపోయింది:

"ఈవిషయంలో మీరు నన్ను క్షమించాలి; లేనిపోని కారణాలతో మీరు అనవసరంగా బాధపడకండి: జీవితంలో ఇంకా చదవాలనేది నాఆశయం, మీఅనుగ్రహం లభిస్తే

నా ఆశయానికి అవరోధాలేమీ ఉండవు.” అని తలవంచుకొని మేడమీదిగది వైపుకు నడక సాగించాడు నాగభూషణం. అతని చేతిలో వున్న పుస్తకం జారి క్రిందబడ్డ విషయాన్ని అతను గమనించనేలేదు; కుర్చిలో మేనువాల్చి ఒక్కాప ర్యాయం సుదీర్ఘంగా నిట్టూర్చి తేలిగ్గా కళ్ళుమూసుకున్నాడు;

విశాఖపట్నం యూనివర్సిటీకాలేజి వాతావరణంలో అడుగుపెట్టాడే కానీ నాగాభూషణం మనస్సుకు సంతోషం అనేది ఏకోశానా లభించలేదు: అది అవసరమైనపుడు దొరకని వస్తువులా అగుపించింది. ఏపాఠ్యపుస్తకం పట్టుకున్నా, ఏనవల పుటలను తిరగేస్తున్నా ఏసినీమా చూస్తున్నా, ఏవేవో ఆలోచనల ప్రతిస్వరూపాలు వివిధభంగిమల్లో అతని మెదడులో నాట్యంచేసి, అతనికి న్యాయంగా లభించాల్సిన విజ్ఞానాన్ని, పొందాల్సిన వినోదాన్ని, అనుభవించాల్సిన ఆనందాన్ని అణవేసేవి: ఒక్కోమారు ఒంటరిగా ఉన్నపుడు, తాను ఇక్కడికి ఎందుకు వచ్చినట్టు? ఏమి సాధించాలని వచ్చినట్టు? ఐనవారి హృయాలను సంక్షోభపెట్టి తాను బావుకోనేదేమిటో, అని అనుకునేవాడు. వెంటనే తాను విజ్ఞానార్జనకోసం రాలేదు. కానీ ఆశయసాధనద్వారా జీవితగమ్యాన్ని చేరుకోవటంలో కలిగే ఇక్కట్లను ఎదుర్కోటానికి వచ్చాడు. తాను అనసూయను దక్కించుకోవాలి. అదే తన ఆశయం. తనను నమ్ముకున్న తన అనసూయను, తన కష్టసుఖాల్లో పాలుపంచుకుంటూ, జీవితపథంలో తనతో పాటు నడకసాగించాలనే ఆశపెట్టుకుని సర్వస్వం తనకర్పించిన తన అనురాగతల్లరి అనసూయను తాను కాపాడుకోవాలి. ఆ అనురాగాన్ని పెంపొందింప చేసుకోటానికే తాను కన్నవారిని కాదని వచ్చాడు. మెదడులో ఈ ఊహ తలెత్తగానే అతనిబుఱ్ఱ గిర్రుమంది: కొంతసేపటికి వరండాలో ఉన్న మంచంవద్దకెళ్ళి వెల్లకిలా పడుకుని నింగి వంక చూడటం మొదలెట్టాడు. అల్లా చూస్తున్న నాగభూషణంకు మబ్బులవెనుక చంద్రునిస్వైరవిహారం, అస్పష్టంగా అగుపించే తారకలతళుకులు వింతగా బాధగా తోచాయి; కానీ అనసూయస్వరూపాన్ని తనకళ్ళముందు సృష్టించుకోగానే ఆశిరోవేదన, బాధ అన్నీ సమూలంగా తొలగిపొయ్యాయి; కొంతసేపటికి ఆకాశంలో మబ్బులు శశాంకునికి, తారలకు స్వేచ్ఛగా ఆడుకోటానికి అనుమతిచ్చినట్టు ఎక్కడికో వెళ్ళిపొయ్యాయి;

కాలవాహినిలో ఏడురోజులు కొట్టుకుపొయ్యాయి; ఆరోజు అనసూయనుండి ఉత్తరంవచ్చింది; విప్పిచదివాడు;

“ప్రియమైనభూషణంగారికి,

వందనాలు. ఇంట్లో చదువు చాలించమన్నా, వినకుండా తమరు పట్టుబట్టి విశాఖచేరినట్టు బుచ్చిబాబు ద్వారా తెలిసింది; ఆరోజు కోవెలవద్ద మనం కలుసుకున్నపుడు తమకు చదువు కొనసాగించే ఉద్దేశ్యం లేదని అమ్మానాన్నతో సంప్రదించి మన వివాహానికి తగు ఏర్పాట్లు చేయిస్తానని నాతో పలికారు. కానీ, ఈనాడు మీరు పంతం వేసికున్నట్టు ఉన్నతచదువుకోసం ఊరు వదిలారు. మీమనస్తత్వం నాకేమీ అర్థంకాలేదు! చేసినప్రమాణాన్ని త్రోసిపుచ్చకుండా ఈ దీనురాలిని మీభాగస్వామిగ చేసుకోవాలని ప్రార్థిస్తున్నాను. ఆకాశంలో మబ్బుతెరలు, కోవెలవద్ద పావురాలు తమసఖ్యతను స్ఫురణకు తెస్తుంటాయి! వీలు చూచుకొని మన వివాహవిషయం మీనాన్నగారితో సంప్రదిస్తారని ఆశిస్తున్నాను.

మీఅనసూయ.

ఉత్తరం చదవటం ముగియగానే నాగభూషణం క్రొత్తగా కొనిపెట్టుకున్న కళ్ళద్దాలవెనుక నున్న అతనికళ్ళలోనుండి నీటిబిందువులు జలజలరాలాయి: తలెత్తి ఒక్కమారు ఆకాశంవంక చూశాడు; “అనసూయ తనను అపార్థం చేసుకుంది: అందులో ఆమె తప్పేమి లేదు; ఆమె అల్లా ఊహించటానికి తానే అటువంటిఅవకాశాన్ని కల్పించాడు. దానికి తనబలహీనతే ముఖ్యకారణం: నాన్నగారు తనతో పెళ్ళివిషయం ప్రస్తావనకు తీసుకువచ్చినపుడు తాను అనసూయను ప్రేమించినట్టు, ఆమెను తప్ప జీవితంలో వఃరో అమ్మాయిని కన్నెత్తి చూడనని పలకటానికి తాను సాహసింపలేక పొయ్యాడు; కారణం నాన్నగారేమంటారో నన్న భయం! అల్లానిష్కర్షగా పలికితే. ఆయనను ఎదిరించినట్టు భావిస్తారేమోననే శంక! తాను గుంటూరు ప్లీడరుగారు వ్రాసినఉత్తరం చూశాడు; తనకు ఇష్టంలేని ఆసంబంధం తప్పించి తనఅనసూయను చేరదీయాలనే ఉద్దేశంతోనే ఉన్నతచదువుమిషమీద తాను మరల విశాఖను చేరుకున్నాడు. కానీ ఈవిషయాలన్ని అనసూయకు ఎలా తెలుస్తాయి. లేఖ ద్వారా ఈ సంగతి తెలిపినా, అపార్థం చేసికున్న అనసూయ తనఅభిప్రాయాలను విశ్వసిస్తుందా? ఇదంతా తనలో కరడు గట్టిన పిరికితనం యొక్క పర్యవసానమే. అందుకే సూర్యం అప్పుడప్పుడు తనను “అసమర్థుడు” అని అంటుంటాడు. ఏవిషయంలోను తాను ధైర్యంగా మాటాడలేనపుడు, ఒక్క సూర్యమేకాదు, యావత్ప్రపంచం తన్ను అసమర్థుడిక్రింద జమకట్టి తీరుతుంది; తనబ్రతుకు కేవలం ఒకఅసర్థుడి జీవయాత్రలాగ ఎందుకూ కొరగాకుండా పోతుంది. ఊహాపథంలో కట్టుకున్న ఆశయాలమేడలకు నిజజీవితంలో పునాదులు వేయలేకపోతే తనబ్రతుకు వ్యర్థంకాక మరేమిటి”

“ఏమిట్రా, భూషణం. తెగ ఆలోచిస్తున్నావ్! కాలేజికి, త్వరగా వెళ్ళకపోతే, ప్రొఫెసర్ గారికి కోపం రావచ్చు; హరీయప్” అన్న సూర్యంపలుకులకు అతనిఆలోచనలు దీపకాంతికి చెదరిపోయిన చిమ్మచీకట్లలాగ పటాపంచలయ్యాయి; కన్నీటిచారలతో కందిపోయిన ముఖాన్ని ప్రక్కకుత్రిప్పుకొని “అవునోయ్, కాలేజికి టైమైంది; నీకోసమే వెయిట్ చేస్తున్నా పదపోదాం;” అని సూర్యంను యాంత్రికంగా అనుసరించాడు;

క్లాసులో కూచున్నంత సేపూ భూషణంమనస్సు అనసూయ ఉత్తరాన్నిగూర్చి పరిపరివిధాల ఆలోచిస్తోంది.

మార్నింగ్ సెషన్ చివరిగంట కొట్టగానే. మధ్యాహ్నం కాలేజి ఎగ్గొట్టి తిన్నగా రూమ్‌చేరుకున్నాడు; కుర్చీలో కూచుని బుక్ షెల్ఫ్‌లోనుండి మేకేర్లీనవల నొకదానిని బయటికి తీసాడు చదవాలని. కానీ ఎందుకో చదవబుద్ధేయ లేదు; టేబల్ మీద పడేసి గదిపైకప్పును చూస్తూ కూచున్నాడు; ఏమీ తోచక అటూఇటూ పచార్లు సాగించాడు; ఉన్నట్టుండి తాను మధ్యాహ్నం భోజనం చేయలేదన్న విషయం జ్ఞాపకానికొచ్చింది: చేతిలో గడియారం వంక చూశాడు: దాదాపు రెండుకావస్తోంది. గదితలుపులు వేసి తిన్నాగా హోటల్ వైపు దారితీశాడు.

"భోజనం. ఐపోయిదండీ! కొంతసేపుకూర్చుంటే వండించి పెడతాను." అయ్యర్ పలికాడు, మధ్యాహ్నం ఖర్చైన మిల్స్ టిక్కెట్లను లెక్కెట్టడం ఆపి.

"అవసరం, లేదులే!" అని మరోహోటల్‌లో టిఫిన్ చేసి గదిచేరుకొన్నాడు;

సాయంత్రం నాగభూషణం నిద్రనుండి లేచేసరికి ఐదు దాటింది: ముఖంకడుక్కుని, టాయిలెట్ అయి వరండాలో వచ్చి నిల్చున్నాడు: వర్షాకాలమైనా ఆకాశం మబ్బులతో కాక, చాలనిర్మలంగా అగుపించటమేగాక. క్రుంగిపోతున్న అహస్కరుని తాలూకు అరుణకాంతితో పశ్చిమ దిశ ఒకవర్ణచిత్రంలా సొంపుగ అగుపిస్తోంది. రెక్కలువిప్పుకొని ఆకసంలోనికి ఎగిరిపోతున్న కపోతాలజంటను చూడగానే అతని ఊహలు ఉయ్యాలలూగాయి; "ఎంతటి స్వేచ్ఛాజీవులు: చీకూ చింతలు లేకుండా రెక్కలు విప్పి హాయిగా స్వేచ్ఛగా జీవితాన్ని ఆనందమయంగా గడుపుతూ, లోకందృష్టిని సగర్వంగా తమవైపు త్రిప్పుకుంటాయి; ప్రపంచంలోని ప్రాణుల్లోనికల్లా మానవజన్మ ఉత్తమమైనదంటారు. కానీ మానవుడు ఈభూమిమీద అడుగెట్టి దీన్ని వదలివెళ్ళేవరకు శతకోటి ఆలోచనలతో సతమత మవుతాడు; అడుగడుగునా కష్టాలకు గురియవుతాడు; నానాబాధ లనుభవిస్తాడు; ఏమంటే గమ్యాన్ని చేరుకోటంలో అవి సహజంగా ఏర్పడేవంటాడు: కోరికలు నెరవేరకపోతే ఆశయాలకు సంకెళ్ళుపడటం అనివార్యమంటాడు; తలవంచి మొండిగా బ్రతుకుబండను లాగుతు తన నడకను కొనసాగిస్తాడు; కానీ స్వేచ్ఛను తమకై వశం చేసుకున్న ఆపక్షులకు అలాంటి అగత్యమేముంది?"

"బాబు" కేక వినిపించింది:

ఆకేకతో ఉలికిపడి ఆలోచనల్లోనుండి బయటపడి వెనువిరిగి చూశాడు: "బాబుగారు!" మరోమారు అదే పిలుపు. దైన్యతను ముప్పిరిగొన్న ఆపలుకుల్లో ఒకవిధమైన నిస్సహాయత, బాధ, ధ్వనించాయి;

"ఏం చిట్టెమ్మ!" నాగభూషణం పనిమనిషిని పరామర్శించాడు.

"ఇయ్యాల నాబిడ్డకు మల్లీ జరమొచ్చింది: ఒకపావలా డబ్బులిత్తే కాసింతగంజి కాసిపోత్తాను:"

"అరే! మరల తిరిగిందా! డాక్టర్‌గారికి చూపక పోయావ్?" అని అంటూ జేబులో చెయ్యిపెట్టాడు:

"ఎందుకులేండి, బాబుగోరు! అదే పోతాది" అంది చిట్టెమ్మ. 'తమకు అటువంటి వ్యాధులు వచ్చిపోవటం పరిపాటే' నన్న ధోరణిలో.

జేబులోనుండి అర్థరూపాయ తీసి ఆమెచేతిలో వేసి, గది తలుపులు బిగంవేసి వీధిన పడ్డాడు; కాఫీ తీసుకొని "ఎటు వెళ్ళాలా?" అని ఆలోచిస్తూ నడుస్తున్నాడు; ఉన్నట్టుండి అతనిదృష్టి అక్కడే ఉన్న ఓ సినీపోస్టర్ మీద బడింది: సరాసరి ఆథియేటర్ వద్ద కెళ్ళి టికెట్ తీసుకొని హాలులోనికి ప్రవేశించాడు. అప్పటికే పిక్చర్ మొదలయింది; కొంతసేపటికల్లా నాగభూషణం తెరమీద నాయికాపాత్రలో లీనమైపోయ్యాడు;

నాయకుడు తల్లిదండ్రులు చూచిన సంబంధం ఇష్టంలేక. ప్రేమించిన అమ్మాయిని కాదనలేక, కన్న తండ్రితో తీవ్రంగా ఘర్షణపడ్డాడు.

"నాన్నా! వారు కూటికిపేదలు కావచ్చు, కానీ గుణానికి కాదు; నేను ఆ అమ్మాయిని ప్రేమించాను; అందంలో రంభను మరిపిస్తుంది; గుణానికి పెట్టిందిపేరు; అంతకంటే ఏంకావాలి? వారు కట్న ఇచ్చుకో లేనంతమాత్రాన ఆసంబంధాన్ని త్రోసిపుచ్చడం న్యాయమేనా? మనకు బోలెడు ఆస్తి ఉంది: వారు ఏమీ ఇవ్వకపోయినా ఒరిగేదేమీ ఉండదు."

"చాలు నీప్రసంగాలు, ప్రేమజీవితం; కట్ననిషేధం: ఇలాంటిఆదర్శాలను వల్లిస్తూ జీవితంలో బాగుపడ్డవాడొక్కడు లేడు; అవన్నీ నోటివాక్యాలే: కానీ, తీరా ఆచరణ దగ్గరికొచ్చేసరికి అవి నీటిమీద వ్రాతలుగా మారిపోతున్నాయి; ఒకవేళ ఎవడైనా సాహసించి ఆచరణలో పెట్టాడా, వాడిబ్రతుకు విషాదమయమవుతుంది. ఇంతఆస్తీ హోదా పలుకుబడి కలిగి. ఈనాడు నేను చిల్లిగవ్వ కట్నంలేకుండా ఒక పేదింటిపిల్లను నాకోడలుగా స్వీకరిస్తే రేపొద్దున తలెత్తుక తిరగ్గలనా? కట్నంలేకుండా ఈసంబంధానికి అంగీకరించటమనేది నాఅభిమతానికి విరుద్ధమైనవిషయం.

"నాన్నా, శీలవతియైన ఒకఅమ్మాయితోడి సంబంధాన్ని ఇలా కట్నంతో ముడిపెట్టి నాకు నేను నాజీవితంలో కారుచిచ్చులు రగిలించుకోలేను; మనహోదాను, పలుకుబడిని కొలిచే కొలతబద్ద కట్నమే అనేది మీఅభిప్రాయమైతే, మీఅభిమతాని కనుగుణ్యంగా నడుచుకోలేనందుకు మీరు నన్ను మన్నించాల్సుంటుంది..."

"అంతేనా! అదే నీవుద్దేశ్యమైతే నాఆస్తిలో నీకు చిల్లిగవ్వకూడ దక్కదు; ఆస్తినంతా ఏదారినబోయే దానయ్యకో వ్రాసిస్తాను; తక్షణం ఈ ఇంట్లోనుండి బయటికి నడు; ఇకమీదట నాకు నీమొహంచూపకు..."

"అలాగే" అని పలికి నాయకుడు చేతిలో ఒకసూట్ కేసుతో గడపదాటాడు; విశ్రాంతికోసమని ఫిలిం నడవటం

ఆగింది: లైటు వెలిగింది: నాగభూషణంకు ఇంకా ఫిలిం చూడాలనిపించలేదు; థియేటర్‌నుండి బయటపడి రోడ్డు మీద వడివడిగా నడవసాగాడు; అతనిలో ఎక్కడలేని చైతన్యం వెల్లివిరిసింది. తాను కూడా ఆ "హీరో" ఉన్న పరిస్థితుల్లో ఉన్నాడు; ఈసందర్భంలో తానుకూడా అలాగే ప్రవర్తించాలి. తండ్రేకాదు; తనఅభిప్రాయాలకు అడ్డువచ్చే ఏవ్యక్తినీ తాను లక్ష్యపెట్టకూడదు. అదే తనలక్ష్యం. తన అనసూయను దక్కించుకోవాలనే తన లక్ష్యసిద్ధికి, చిత్తశుద్ధితో పాటుపడాలి" ఏదేదో ఆలోచిస్తూ గది చేరుకున్నాడు; తలుపులు తెరచి గదిలోని కడుగెట్టాడు. అంతాచీకటీ; లైటు వేశాడు; వెలుతురు వచ్చి చీకటిని పారద్రోలింది; సినిమా చూశాక తన హృదయంలోని ఆ వేదనకూడ అదేవిధంగా తొలగిపోయింది; తనసమస్యా పరిష్కారానికి ఒకమార్గం అనేది ఏర్పడింది; కుర్చీలో కూర్చుని చేతికి కలంతీసుకుని కాగితం ముందు పెట్టుకున్నాడు.

"ప్రియమైన నాన్నగారికి,

మీపుత్రుడు నాగభూషణం

చేయు హృదయపూర్వక ప్రణామములు; మీరు గుంటూరు ప్లీడరు రామనాథంగారి అమ్మాయి సంబంధవిషయమై వత్తిడిచేస్తూ వ్రాసిన ఉత్తరాలు రెండూ చేరాయి; నాకు ఇష్టంలేని సంబధాన్నిగూర్చి ఆలోచించడంవల్ల కలిగే ప్రయోజనమేమీ ఉండదు; నేను ఒకఅమ్మాయిని ప్రేమించాను; ఆ అమ్మాయితల్లిదండ్రులు చాలబీదవారు; కట్నం రూపేణా ఏమీ ఇచ్చుకోలేరు; కాని గౌరవ నీయమైనకుటుంబం ; ఇందువల్లనే గుంటూరుసంబంధమంటే నాకు ఇష్టంలేదు; మీకు ఈవిషయంలో ఏదైనా కష్టంకలిగితే నన్ను మన్నించండి: మీకిష్టమైతే అమ్మాయిఊరు, పేరు, తెలపటంలో నాకేమీ అభ్యంతరంలేదు; నా ఈసాహసాన్ని మన్నించగోరుతున్నాను. మీఉత్తరంకోసం ఎదురు చూస్తుంటాను.

మీ అనురాగ తనయుడు

నాగభూషణం"

ఉత్తరం మడిచాడు; కవరులోపెట్టి పోస్ట్‌చెయ్యాలనుకున్నాడు: కాని చెయ్యలేకపొయ్యాడు: నాన్నగారినుండి మరోఉత్తరం వచ్చేవరకు తాను ఉత్తరం వ్రాయాల్సిన అవసరమేముంది? గాలివీచినవుడు గింజలు తూర్పెడితేనే పొట్టువేరై రైతుకు మంచిధాన్యం లభిస్తుంది. అల్లాగే తానుకూడ సమయాన్నిబట్టి ఉత్తరంవ్రాస్తే సత్ఫలితాన్ని సాధించటానికి అవకాశముంటుంది: కాని అందుకు భిన్నంగా ఉన్నట్టుండి ఇల్లా ఉత్తరంవ్రాస్తే మతిచలించిందనుకుంటారు: కట్నాలవ్యామోహంలో పడి ప్రేమ వివాహాన్ని గౌరవించలేని తనతండివద్ద, పని సానుకూలం చేసుకోవాలంటే తాను ఎంతోజాగ్రత్తగా ప్రవర్తించాల్సింటుంది;" అని అనుకొన్నాడు: వ్రాసినఉత్తరం చించేశాడు. భోజనం ముగించుకువచ్చి పడుకున్నాడు. కొంతసేపటికి నిద్రాదేవి అతన్ని ఆశీర్వదించింది;

ఐదురోజులు గడిచాయి; ఆ రోజుఉదయం నాగభూషణం కాలేజికి వెళ్ళిరాగానే గదివద్ద కూర్చున్న జోగయ్య అగుపించాడు;

"ఎప్పుడొచ్చావ్ నాన్నా? ఇంటివద్ద అంతాకులాసాయేనా? వస్తున్నట్టు ఉత్తరంముక్కైనా వ్రాయలేదే" అని అన్నాడు గదితలుపులు తీస్తు:

"అనుకోకుండా వచ్చాను; అన్నట్టు నాఉత్తరాలే నీకు చేరలేదట్రా! లేక జవాబువ్రాయటానికి తీరికలేకపోయిందా; నిన్నటిరోజు రామనాథంగారు స్వయంగా వచ్చి మాటాడి పొయ్యారు: అందుకోసమే పనిగట్టుకు మరీవచ్చాను; ఇంతకీ..." జోగయ్యపలుకులు నాగభూషణం నోరువిప్పటంతో ఆగిపొయ్యాయి;

"ఈ ఎం.ఏ., కాస్త ముగిసేవరకు పెళ్ళిమాట తలపెట్టకండి నాన్నగారు! వైవాహికజీవితంలో అడుగెట్టాక చదువు కొనసాగించటం కష్టం" "ఒరేయ్ భూషణం! ఎంత చదివినా అంతేనని నీకు లక్షాయాభైమార్లు చెప్పాను, నీవు ఆ స్వల్పవిషయాన్ని అర్థం చేసుకోలేకుండా ఉన్నావ్; చదివింది చాలు కానీ, ఈసంబంధానికి ఒప్పుకో"

నాగభూషణంమనస్సు కొంత తపనచెందింది. హృదయం అనసూయస్వరూపాన్ని తిలకిస్తూ గాలిలో తేలిపోతోంటే అందులో తాను మరొకరికి స్థానం ఎల్లా ఇవ్వగలుగుతాడు? లోగడ తానుచూచిన పిక్చర్‌లోని "హీరో" జ్ఞాపకానికొచ్చాడు. తెగించి ఉన్నవిషయం చెప్పేయాలనుకున్నాడు; మాటలు నోటిదాకా వచ్చాయి; కానీ పెదవుల సరిహద్దులను దాటలేకపొయ్యాయి; ఎక్కడలేని గుండెదడ పుట్టుకొచ్చింది. కారణం నాన్నగారు ఏమంటారోనని: అంతే: ఏదో చిన్నఊహ స్ఫురించింది;

"నాన్నా అమ్మాయినైనా చూడకుండా ఈసంబంధానికి ఎల్లాఒప్పుకోటం...."

"ఒస్, దానికేమిట్రా, ఈరోజే గుంటూరుకు ప్రయాణం కట్టు; నిక్షేపంగా వెళ్ళి అమ్మాయిని చూచిరావచ్చు"

అదికాదు, నాన్నా! వారంరోజులు సెలవుపెట్టి నేను మనవూరికి వస్తాను. అక్కడనుండి అమ్మాయిని చూట్టానికి వెడదాం అనిఅన్నాడు భూషణం; జోగయ్య ఏమనుకున్నాడోఏమో ఒక్కక్షణం దీర్ఘంగా ఆలోచించి, సరే, వారం రోజులు లీవుపెట్టి నాలుగైదురోజుల్లో వచ్చెయ్యి; అని అన్నాడు; హోటల్‌నుండి క్యారియర్ రాగానే తండ్రీ కొడుకులు భోజనం ముగించారు; మరుసటిరోజు ఉదయం జోగయ్య ఊరికి ప్రయాణమయ్యాడు;

"అమ్మయ్య!" అని స్వేచ్ఛగా ఊపిరిపీల్చాడు నాగభూషణం

మూడురోజులైనా గడవకముందే అనసూయనుండి ఆరోజు మరోఉత్తరం వచ్చింది. "ప్రియమైన భూషణం గారికి,

ప్రణామాలు. మీనాన్నగారు తమ పెళ్ళిచూపులకు గుంటూరుకు ప్రయాణసన్నాహాలు చేస్తున్నట్లు అందుకు తమరు సిద్ధమైనట్లు తెలిసింది; మీరింతటి మోసకారులనీ, తడిగుడ్డతో గొంతులుకోసేవారని, నేను కలలోనైనా ఊహించలేదు; తమరు పల్కించే ఆదర్శాలు వింటున్నంతసేపు నాజీవితానికి వెలుగుచూపి మీరు నన్ను ఒకఒడ్డుకు చేర్చగలరని విశ్వసించాను; కానీ అది కేవలం 'భ్రమ' మాత్రమే అని చాలఆలస్యంగా తెలుసుకున్నాను! మిమ్మలను హృదయపూర్వకంగా ప్రేమించాను, మీహృదయం సముద్రంలాగ విశాలమైనదనీ, నిర్మలమైనదనీ, అందులో హాయిగా ప్రయాణంచేయవచ్చనీ ఎన్నోకలలు గన్నాను: కాని అందులో సంకుచిత భావతరంగాలు పొంగిపొర్లుతుంటాయని నేను ఊహించలేకపోయ్యాను; మీనాన్నగారికి మల్లే మీకూ కట్నంమీద ఆశఉంటే, మీరు నన్ను ఎందుకు ప్రేమించారు? లేనిపోని ఆశలతో ఈపేదరాలి హృదయంలో ఎందుకు రత్నసౌధాలు నిర్మించారు? నన్ను అన్యాయం చెయ్యాలనేనా? దిక్కులేని అభాగ్యురాలిని అన్యాయం చేశారంటే ఈజన్మలోనే అందుకు తగినశిక్షను అనుభవిస్తారు! ఈవాక్యాలతో మీహృదయాన్ని నొప్పించటం నాధ్యేయంకాదు గానీ, నాబాధను వెళ్ళగక్కుతూ మీరుచేసిన వాగ్దానంప్రకారం నన్నుపెళ్ళి చేసుకోమని ప్రార్థిస్తున్నాను. ఈప్రపంచంలో నేను సుఖంగా బ్రతకాలనే ఆశ నాకు ఏకోశానా లేదు కానీ, మనప్రణయానికి ఫలితంగా జన్మించబోయే బిడ్డశ్రేయస్సుకోసమైనా మీరు నన్నువివాహంచేసుకోవాలి. చేసుకోక తప్పదు: మీరు వివాహానికి తిరస్కరిస్తే నేను సమాజానికి నాముఖంచూపలేను; నాబ్రతుకు చీకట్లో అంతమై...."

అంతే, నాగభూషణం ఇకఉత్తరాన్ని చదువలేకపోయ్యాడు. అతనిహృదయంలో అగ్నిగోళాలు బ్రద్దలై లావా పొంగి పొరలి ప్రవహించింది,

"అనసూయా! ఒక్కమారు గట్టిగా అరచాడు; ఉత్తరం నేలమీద పడి గాలికి రెపరెపలాడింది. ఏమిటికర్తవ్యం? అనసూయహృదయంలో చెలరేగిన పెనుతుఫానును ఆపటానికి మార్గమేమిటి? అనసూయ తనను సంపూర్తిగ అపార్థం చేసుకుంది: అనసూయ మాతృమూర్తి కాబోతుంది" ఈఆలోచన స్ఫురణకురాగానే నాగభూషణం ఒళ్ళు జలదరించింది. అచేతనుడై అల్లాగే కుప్పలా కుర్చీలో కూలబడ్డాడు, అప్పుడే గదిలో అడుగెట్టిన సూర్యం అతని వాలకంచూచి కొంత కంగారుపడ్డాడు; పలకరిస్తే సమాధానం రాలేదు. క్రిందబడి గాలికి అటూఇటూ పచార్లు చేస్తున్న ఉత్తరం కంటబడింది. చేతికి తీసుకొని చదివాడు. మరుక్షణంలో సూర్యం విచలితుడయ్యాడు;

"భూషణం. ఇంకా ఏమిటాఆలోచనలు?" అని అరిచాడు సూర్యం.

"ఆ, సూర్యం : ఉత్తరం, ఉత్తరంచదివావా? నేనేం చెయ్యాలి? నాకేమీ బోధపడలేదు;" కంటతడిపెట్టి దీనంగా పలికాడు సూర్యం:

"ఒకవంక కొంపలంటుక కాలిపోతుంటే, ఇంకా ఏమీ బోధపడలేదట్రా! వెంటనే వెళ్ళి నీఅనసూయను దక్కించుకో. చేతులు కాలాక ఆకులు పట్టుకుంటే లాభమేముంటుంది? ప్రవహించిన నీటికి వారిధి కట్టడం అసాధ్యమైనపని; వెళ్ళు! త్వరగావెళ్ళు! పరిస్థితులు విషమించకముందే వెళ్ళి నీఅనసూయను దక్కించుకో! ఈవిషయంలో మీతల్లిదండ్రులే కాదు: దేవుడు అడ్డొచ్చినా ప్రతిఘటించు" అని అరిచాడు గట్టిగా:

"అవును, వెడతాను: ఇప్పుడే వెడతాను." అని పలికాడు భూషణం, ఎక్కలేని ధైర్యం మూటగట్టుకొని,

బండిదిగి ఇంట్లోని కడుగిడుతుండగానే బుచ్చిబాబు పరిగెత్తుకవచ్చి "అన్నయ్యా! అన్నయ్యా! మరే, అనసూయ వదినె ఉరేసుకు చచ్చిపోయింది. మనింటికివచ్చి నిన్ను పెళ్ళాడతానంటే, అమ్మా నాన్న "మాకునీమొహం చూపకు. మావాడికి గుంటూరులో పెళ్ళినిశ్చయమైంది; ఇక పదిహేను రోజుల్లో మావాడిపెళ్ళి జరిగిపోతుంది. నీవు ఆ ఆశ వదులుకో" అని ఏమిటేమిటో తిట్టి పంపారు; పాపం! దానితో అనసూయవదినె ఏడుస్తూవెళ్ళి ఉరేసుకు చచ్చిపోయింది;" అని పలికాడు: "ఆ! నిజంగానా" అని అన్నాడు, భూషణం నిర్విణ్ణుడై. అతనికాళ్ళక్రింద నేల చలించినట్టయింది. తల గిర్రుమంది. "అమ్మా! "అని అరచి దభేలుమని నేలగూలాడు. జోగయ్య ఆదిలక్ష్మమ్మలు ఇంట్లో నుండి వరండాలోనికొచ్చి కంగారుగా భూషణాన్ని ఎత్తి మంచంమీదికి చేర్చారు.

డాక్టర్ ఇంజక్షన్‌తో స్పృహవచ్చాక "అనసూయా, నీవు తొందరపడి ప్రాణత్యాగంచేశావు. నీకు అన్యాయం చేకూరేలోపుగా నాకు దూరమయ్యావు, శాశ్వతంగా దూరమయ్యావు. నీబ్రతుకును నేను చీకట్లో త్రోసేసాను. కనుక భగవంతుడు నాకేశిక్ష విధించినా మనసార అనుభవిస్తాను! అనసూయ, నాపాపానికి నిష్కృతి ఉంటుందా?" అని విలపించాడు భూషణం. అతనికళ్ళలో నీరునిండి వెలుపలికి వచ్చి చెక్కిళ్ళమీదుగ ప్రవహించాయి. మాసంరోజులకు కానీ నాగభూషణం జ్వరంనుండి కుదుట పడలేదు:

జోగయ్య బలవంతంకొద్దీ గుంటూరుసంబంధం నిశ్చయమైంది! ఆరోజు పెళ్ళికొడుకును చేశారు: పెళ్ళికొడుకు దుస్తుల్లో ఉన్నా భూషణంముఖంలో కళఅనేది ఏమాత్రం అగుపించలేదు!

"అదేమిట్రా మరీ అంత డల్ గా ఉన్నావ్! గడచిన గడియలు జ్ఞాపకానికి తెచ్చుకొని అనవసరంగా బాధపడకోయ్; గతాన్ని మరచిపో" అని అన్నాడు పెళ్ళికివచ్చిన సూర్యం!

మరుసటిరోజు గుంటూరుకెళ్ళటానికి ప్రయాణ సన్నాహాలన్నీ ముగిశాయి: తెల్లారేసరికి పెళ్ళికొడుకు ఎక్కడికో పరారయ్యాడంటే పరారయ్యాడనే వార్త విన వచ్చింది:

"పరారు కాకేమిటి? కట్నాలు ఆశించి ఇష్టంలేని సంబంధాలు ఖాయపరిస్తే, ఎవరుమాత్రం సహిస్తారు: పెళ్ళికి కావలసింది హృదయాలు కలియటంకానీ, కట్నాల రూపంలో కాసులు రాలటంకాదు. నాగభూషణం పిరికి వాడు: అసమర్థుడు: ఏవిషయాన్ని తల్లిదండ్రులవద్ద సూటిగా, నిర్భయంగా చెప్పలేకపొయ్యేవాడు; ఇందువల్లనే అనసూయజీవితం నీటగలసింది. తనజీవితాన్నికూడ కష్టాలపాలు చేసుకున్నాడు: పాపం! ఎక్కడికెళ్ళాడో! ఎల్లా బ్రతుకుతాడో" పరితపించాడు సూర్యం:

రోజుకుమల్లే సూర్యుడు తూర్పున ఉదయించి, పడమట అస్తమిస్తున్నాడు. నాగభూషణం ఎక్కడికెళ్ళాడో, ఏమైపొయ్యాడో తెలియరాలేదు: ఏది ఏమైనా అతడు ఒకఅసమర్థుడు! అతనిబ్రతుకు అసమర్థుని జీవయాత్ర! అటు వంటివారు జీవితంలో తమ గమ్యస్థానాలను ఎల్లా చేరుకుంటారో మరి?

దీపావళి ప్రాముఖ్యము

ప్రపంచంలో 'వెలుగు' (ప్రకాశం)అనేది మానవుడి యొక్కభవిష్యత్తులోని హానివృద్ధులకుచిహ్నమని పెద్ద లన్నారు. ఈ తేజోరూపచిహ్నన్నిగూర్చి ఋగ్వేదంలో ప్రార్థనలుకూడ కొన్ని ఉన్నాయి. ఈ "వెలుగు" ఇహలోకంలో ఆనందాన్ని, ఆ తరువాత పరముక్తి ని జీవికి లభింపజేస్తున్నది. ఆ వెలుగే మనకు "దీప" రూపంతో ప్రత్యక్షంగా సాక్షాత్కరిస్తున్నది. "అంతరంగంలో దీపజ్వాల మోస్తరు ప్రకాశించే ఆత్మనుగూర్చి ధ్యానించు—అని యాజ్ఞవల్క్యమహర్షి ఆదేశించాడు. "నీవు నీకే ఒక దీపంవలె ప్రకాశించాలి" అని బుద్ధుడు ఆజ్ఞాపించాడు. సాంసారికం, సాంఘికం, మతకార్యం, ఆధ్యాత్మికం అయిన ఆనందానుభవ మహోత్సవాలన్నింటిలోను మానవుడు సాన్నిహిత్య మయిన ప్రత్యక్ష దీపతేజోమూర్తిని ఆశ్రయించటం సర్వసాధారణం, కాన మన భరతఖండంలోని జాతీయ దీపోత్సవాలెన్నో గలవు. అందులో "దీపావళి" ప్రఖ్యాతి చెందినది. "దీపావళి" అంటే, దీపాలవరుస అని అర్థం. అలా వరుసలు తీరిన దీపారాధన యథాతథంగా ఉత్తరభారతంలో ఇంటింటా మనం చూడవచ్చును. ఈ దీపావళి మహోత్సవం కార్తికంలో తటస్థమవుతున్నది. మన దాక్షిణాత్యులకు ఆ కారణంచేత, మన దక్షిణ దేశంలోని దేవాలయాల్లో, ఇండ్లలో కార్తికంలోనే దీపాలను వరుసలు వరుసలుగా వెలిగించి మ్రొక్కడం చూస్తున్నాము. అసలు వాటిని "కార్తిక దీపాలు"- అనే అంటున్నాము. ఈ దీపావళి, ఆశ్వయుజ అమావాశ్యనాటినుండి కార్తిక పౌర్ణమివరకు ఆచరిస్తారు. కార్తికంతో శరదృతువు ప్రారంభం కావటంవల్ల, ఆ ఋతువంతా పిండి ఆరబోసినట్లు పండు వెన్నెలలు భూమండలమంతా నిండుకొని కాస్తుంటుంది. అప్పుడు దేశమంతటా కౌముదీమహోత్సవాలు వెల్లివిరుస్తవి. దీపావళి పండుగ తరువాత ఇలాటి వెలుగుతో ప్రకాశించేమహోత్సవాలను ఎన్నిటినో ఆచరిస్తారు. అవిదేనికి తగిన ప్రాధాన్యాన్ని అవి పొందుతూ పంచాంగాల్లో దృష్టిగోచరం అవుతూఉంటవి. అన్నిటికంటే దీపావళి పండుగే ఘనంగా కొనియాడ బడుతున్నది. దక్షిణ భారతదేశంలో దీపావళీ అభ్యంజన స్నానాలయిన మరునాడు శొంఠి (పొడి) చూర్ణంతో కూడిన బెల్లపు పానకాన్ని ఆయుర్వేదానికి అది దైవతమయిన ధన్వంతరి (జయంతి)కి నైవేద్యంగా సమర్పించి, ఆరోగ్యలాభాన్ని కోరుతూ, ఆ నివేదిత శేషాన్ని ప్రసాదంగా స్వీకరిస్తారు. కావున దీపావళికి ఈ జయంతికి సంబంధం ఉన్నదంటారు. అంటే, అనారోగ్యం అనే అంధకారాన్ని నిర్మూలించి, ఆరోగ్యం అనే తేజస్సుతో ప్రజ ప్రకాశించును. అని ఆర్యుల విశ్వాసం. ఉత్తరహిందూస్థానంలో వాణిజ్య వృత్తిలో ఉండేవారు అన్నిపండుగలకంటె దీపావళికే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తారు. వారు దారిద్ర్యం అనే తిమిరాన్ని పారద్రోలి తేజోవంతమయిన భాగ్యాన్ని దీపావళి సమకూర్చేదని భావించి, ఆనాడు లక్ష్మీదేవిని ఆరాధిస్తారు. క్రొత్త ఖాతాలు ప్రారంభిస్తారు. ఘూర్జరులకు, మార్వాడీలకు మహోత్సవాన్ని కలిగించే పండుగ దీపావళి. ధర్మశాస్త్రాలు, పురాణాలు గాలించి చూచి, మన

వారు కొన్ని వ్రతాలను ఏర్పరచారు. అందులో దీపావళికి ముందటి దినాన్ని 'ధనత్రయోదశి'గా పంచాంగాలలో పేర్కొన్నారు. దీపావళి అమావాస్య మరునటి దినం వచ్చే కార్తిక శుద్ధ పాడ్యమికూడా ఒక వ్రతదినమే. ఒక పండుగదినమే: ఆనాడు లక్ష్మీదేవి–కుబేరపూజలు చేయవలె: ఆనాడు అంగనలు చేటలతో శబ్దంచేస్తూ, పాటలు పాడుతూ అలక్ష్మిని, దౌర్భాగ్యాన్ని, దారిద్ర్యాన్ని తమయిండ్లనుండి తరిమేయాలట. జ్యోతిశాస్త్రరీత్యాకూడా సంపదభివృద్ధికి ఈ దీపావళికి సంబంధం ఉన్నదని వ్యాపారస్థుల నమ్మకం. ఏమంటే, వర్తకుల వాణిజ్యచిహ్నం అయిన త్రాసు (తక్కెడ)కు పర్యాయపదమైన "తులా"రాశిని అనుసరించి ఈ పండుగలు వచ్చే నెలను "తులామాసం" అని జ్యోతిష్కులు అంటారు.

సంస్కృత వాఙ్మయంలోని వాత్స్యాయన కామసూత్రాల్లో చెప్పబడిన పండుగల్లో దీపావళిని "యక్షరాత్రి"గా గ్రంథకర్త ఉగ్గడించాడు. ఆ తరువాత వారు ఆరాత్రిని "సుఖరాత్రి" "సుఖసుప్తిక" అని వచించారు. ధర్మశాస్త్రాలు, కావ్యాలు, ఈ దీపావళిని "సుఖరాత్రి" "దీపోత్సవం" అని వర్ణిస్తూ, అభ్యంగనము, మధురాహార స్వీకరణము, (ద్యూత)జూదము, వినోదము, పాచికలాడటము మొదలయిన ఆనందదాయకమయిన కార్యాలతో, ఆరోజును గడపాలి అని తెలుపుతున్నవి. అందులో ప్రత్యేకంగా పాచికలాట పూర్వం పార్వతీ పరమేశ్వరులు దీపావళిరాత్రియందు ఆడుతూ ఆనాడా ఆటలో గెలిచి ధనలాభం పొందేవారు. ఆ సంవత్సరమంతా ఎక్కడికి వెళ్ళినా దిగ్విజయంగా గెల్చి లాభంపొందుతారని చెప్పారట. అందుచేత ఆనాడా ఆటకు ఒక విశిష్టత ఏర్పడింది. 'గోక్రీడన' అనగా పశువులను పణంగా పెట్టి పందేలాడటం కూడా ఆనాటి వేడుకలలో ఒకటిగా పరిగణిస్తారు.

పూర్వకాలంలో దీపావళి మహోత్సవం ఘనమయిందిగా పైఅంశాలవల్ల ఋజువు అవుతున్నవి. అయితే కాలాలు మారేకొద్దీ మన పూర్వులు ఏ కారణాలచేత దీపావళిని ముఖ్యమయిన మహోత్సవంగా కొండాడినారో ఆకారణాలు అడుగునబడి క్రొత్త కారణాలు దాని ప్రాముఖ్యాన్ని చాటేవిగా తలెత్తినవి. మనము దీపావళికంటె 'నరకచతుర్దశికే' ఈనాడు ప్రాధాన్యం ఇస్తున్నాము. ఇందుకు కారణంగా శ్రీ కృష్ణుడు ఆ నరకుణ్ణి చంపేడని, మరణిస్తూ ఉన్న నరకుడు తన జ్ఞాపకార్థం ప్రజలు తాను మరణించిన దినం మహోత్సాహపూర్వకంగా పండుగ జరపాలి, అనీ ఆనాడు, అభ్యంగనస్నానం, నూతన వస్త్రధారణం చేయాలి–అని కృష్ణుణ్ణి నరకుడు వేడుకోగా, అందుకాయన సమ్మతించాడనీ పురాణగాధ. ఈ కథ ఎంతవరకు సత్యమో చెప్పలేము. ఇలాటిదే ఇంకోటి; శ్రీమహావిష్ణువు బలిచక్రవర్తిని అణగద్రొక్కింది, దీపావళి అమావాశ్యనాడని కనుక మరుదినం (పాడ్యమి)నాడు బలిపూజాదినము అని పురాణాలు ప్రబంధాలు చెప్పటమే కాకుండా సిద్ధాంతులు పంచాంగాల్లోకూడా సూచిస్తున్నారు.

చిరకాలంనుంచి పరంపరంగా వచ్చే మనదేశ చరిత్రలో మహోన్నతంగా ఎంచబడే ఒకానొక పవిత్ర దినాన్నిగూర్చి చెప్పే మహిమలను స్థిరపరచటానికి, ఎన్ని కథలయినా, సృష్టికావడం సహజం. ప్రాచీన కాలంలో బలిచక్రవర్తిమీద దేవతలు జయాన్ని సాధించినట్లే, చారిత్రక యుగంలో శకులమీద విక్రమాదిత్యుడు జయం సాధించినాడని ఈ రెండూ కూడా దీపావళిరోజుల్లోనే తటస్థించాయని కొందరంటారు. ఆనాటి విజయోత్సవాన్ని అభ్యంగనాలు, నూత్నవస్త్రధారణాలు, మధురాహారస్వీకరణాలు వీటిమూలంగా ప్రజలు ప్రకటిస్తారని మన వారంటారు. ప్రత్యేకంగా జైనులు పవిత్రమయిన దీపావళిని తమ మతకర్త అయిన మహావీరుని నిర్యాణదినంగా పరిగణిస్తారు.

'నరకచతుర్దశి' అనే పదంలోని నరకశబ్దంయొక్క మూలాన్ని సమగ్రంగా పరిశోధించటంలో 'నరకు' డనే అసురుడికా పేరు చెందింది– అనటం ఏమంత యుక్తియుక్తంకాదనీ, అది పాపాత్ములకు ఏర్పడిన నరకలోకం లేదా మృతిచెందినవారు చేరే స్థానం లేదా యముడి సామ్రాజ్యం అనటం సమంజసమయిందని కొందరు చెబుతారు. వాస్తవంలో ఈ దీపావళి మహోత్సవకాలం యముడికీ ఆతడిలోకానికే సంబంధించిందిగా కనబడుతున్నది. ఏలనంటే పరలోక వాసులయిన మన పెద్దల ఆత్మలు మనుష్యలోకంలో జీవిస్తున్న తమసంతానంతో కలిసి మెలిసి వారిచ్చే ఆతిథ్య సత్కారాలను పొందాల్ననే కాంక్షతో మహాలయ పక్షప్రారంభంలో మన మనుష్యలోకానికి వస్తారట. మహాళయంలో మానవులు తమ చనిపోయిన పెద్దల ఆత్మలయెడ అనుగ్రహంచూపవలెనని ప్రార్థిస్తూ పితృపతి అయిన యముణ్ణి ఆరాధిస్తారా, లేదా, తెలుసుకోవటానికే ఆపక్షందినాలు–

అనగా, మహాళయ అమావాస్యవరకు ఆ పితరులు భూలోకంలో సంచరిస్తారు. ఆనాటినుంచీ నెలదినాలు అనగా, ఆశ్వయుజ (దీపావళి) అమావాస్యవరకు "యమద్వితీయ" అని పేర్కొనబడుతుంది. యముడి విషయంలో ఆమానవమాసం ఒక్కదినంగా గణింపబడుతుంది. ఆ దినం పెద్దలకు అందరికీ తిలోదకాలతో తర్పణం చేయాలి. ప్రత్యేకంగా యముడికి దీపావళీ అమావాస్య మహాప్రియం. అనాడు యముడు తన సహోదరి అయిన "యమి"తో కూడ భూలోకానికి వస్తాడు. ఉత్తర హిందూస్థానంలో యమద్వితీయనాడు తప్పకుండా సోదర సోదరీమణులు కలుసుకొని ఆటలు, పాటలు, పరస్పర బహుమతుల సమర్పణాలు ఇలాటివాటితో వినోదిస్తారు. ఆదినం సోదరీమణులు తమ చేతులగుండా సోదరులకు పంచభక్ష్య పరమాన్నాలు విధిగా వడ్డించాలి. దీనినే పంచాంగాల్లో– "యమద్వితీయ–భగినీహస్తభోజనం" అని సిద్ధాంతులు సూచిస్తారు.

ఆయితే టపాకాయల ప్రసక్తిలేని యీనాటి దీపావళికి అది ప్రధానంగా ఎలా యేర్పడింది? టపాకాయలు పేల్చడంలో ఐతిహ్యం ఏమిటి? అంటే, వాటి ప్రయోగం మనకు క్రొత్తదికాదు. ప్రాచీనకాలంలో ఉత్సాహంతో ప్రజలు దీపావళినాడు చేసే కార్యాల్లో వాటిని పేల్చడంకూడా ఒకటి. కాని మతసంబంధంగా కూడ దానికి ఒక విధంగా ప్రాముఖ్యం ఉన్నది. మహాలయంలో నరలోకానికి వచ్చిన మనపితరులు "యమద్వితియ" ముగిసిన తరవాత స్వస్థానాలకు వెళ్ళాలి కదా! ఆకాశ మార్గంలో వారు వెళ్ళేటప్పుడు దారి తెలియటానికి ఎత్తుగా నిర్మించిన స్థంభాలకు చివర దీపాలు వెలిగిసారు. గాలిలోకి పైకిలేచే ఆకాశచువ్వలు బురుసులు, టపాకాయలు ఉపయోగించి వెలుగుకలిగిస్తారు. దీనినే "ఉల్కాదాన"మనిమన పెద్దలు అన్నారు

ఉషఃకాలానికిముందే తలంటికొని స్నానంచేసి, లక్ష్మీ, కుబేరుడు, ఇంద్రుడు ఈ ముగ్గురి విగ్రహాలను ఒక పవిత్రస్థలంలో స్థాపించి, పూజించాలి. దీనికి దీపశ్రాద్ధమనిపేరు. అనగా పితరులకు 'దీపార్చన' చేయటమని భావం. ఆలా అరాధించేటప్పుడు దీపాలకు సంబంధించిన మంత్రాలు స్తోత్రాలు పఠిస్తారు. ఆట్టి స్తోత్ర శ్లోకాలలో ఒకదాని భావం దిగువ చూడవచ్చును :–

"యమలోకాన్ని వదలి మహాలయ పక్షంలో ఈ మర్త్యలోకానికి వచ్చిన మా పితరులు స్వస్థంగా తమ నివాసస్థానాలకు పోగలిగేటట్లు ప్రకాశవంతమయిన నీకాంతి పుంజంతో వారికి దారిచూపటానికి, ఓ దీప దేవీ! సహాయపడుము."

ఇప్పటికీకాశీలోని పంచగంగాఘట్టంలో–విశేషంగా ఆనాడు టకాయల్ని పేల్చటాన్ని, ఎత్తయినగడలకొసలలో దీపాలు వెలిగించటాన్ని మనం చూడవచ్చును.

ఈ వాడుక ఆసియా దూరప్రాచ్యానికి, ఆగ్నేయప్రాంతానికి కూడా వ్యాపించినది. తాయిలెండువారు వంగదేశంలో మోస్తరు నీటిలో తేలిపోయే దీపాలను ప్రవాహాల్లో సరస్సుల్లో వదలిపెడతారు. ఎత్తయిన స్తంభాలునాటి, వాటిచివర దీపాలను వ్రేలాడదీస్తారు. కాని జపాన్‌వారు చనిపోయిన పితరులకు జరిపే సత్కారాలు, పూజలు, ఆరాధనలు ప్రత్యేకమయినవి ప్రఖ్యాతి వహించినవి, మన దీపావళిఋతువు వారి పితృతర్పనదినాలు కూడ తటస్థిస్తవి. ఈ విధంగా మరణించిన పెద్దలు, ఏడాదికొకసారి తాము మర్త్య లోకంలో జీవిస్తున్నప్పటి కాపురస్థలాలు, అందు తమ పరంపరకు చెందిన కుటుంబాల జీవితవిధానాలు చూడటానికి, వారికి శుభాలు కలిగించటానికీ రాకపోకలు చేస్తారు. ఆట్టి సందర్భంలో వారి మార్గ ప్రదర్శనానికి అనుకూలంగా సమీపాల్లో ఉండే గుట్టలు మిట్టలుమీద కూడ జాజ్వల్య మానంగా దీపాలు వెలిగిస్తారు.

ఇప్పుడు ప్రపంచంలోని ఆ యాజాతులు, ఆ యాదేశస్థులు ఏదో ఒక విధంగా దీపావలి పండుగను, దీపప్రజ్వలనాదికాలతో జరుపుతూనే ఉన్నారనటంమాత్రం సత్యదూరంకాదు. వేదకాలంలో దీన్ని అతి పవిత్రమయిన దినంగా భావించి కొన్ని యజ్ఞాలుకూడా జరిపేవారు. వినోదాలలోఓలలాడేవారు. మొత్తంమీద అది మహానందాన్ని చేకూర్చేదినం. ఆ పండుగ ఋతువుకు ముందుగానే, మేఘాల అంధకారం, వర్షాల వలని చిత్తడిబాధ తొలగిపోయి ఆకాశం పరిశుభ్రంగా ప్రకాశించేటట్లు తేజోదయం అవుతుంది. దిక్కులు దిగంతాలు విస్పష్టంగా ప్రకాశిస్తాయి. ఆమోదాన్ని కలిగించే శరత్తు ప్రవేశిస్తుంది. లాభాలను మేళ్ళను చేకూర్చే వ్యవసాయ వాణిజ్యాలు ప్రారంభిస్తవి. దీపావళిదివ్వెలు పెద్దలకు మార్గంచూపడమే కాకుండా శాశ్వతమయిన ఆత్మజ్యోతి ప్రార్థనల చిహ్నంగా ప్రకాశిస్తవి.

"తమసో మా జ్యోతిర్గమయ"

(7–11–1961 "హిందూ" పత్రికలోని డాక్టరు వి. రాఘవన్‌గారి ఆంగ్లవ్యాసానికి స్వేచ్ఛానువాదం)

వార్తావళి

న్యూఢిల్లీ

న్యూఢిల్లీలో 26తేదినుండి 30-10-61 తేదివరకు ఉపాధ్యక్షులు శ్రీరాధాకృష్ణన్‌గారి అధ్యక్షతక్రింద జరిగిన గవర్నర్ల సభలో కేంద్రమంత్రులలో కొందఱును, ప్రధాని నెహ్రూపండితుడును- ఆ యా రాష్ట్రపరిస్థితులనుగూర్చి అనేకవిషయాలనుగూర్చి చర్చించారు. అధ్యక్షులయిన శ్రీప్రసాదుగారు కడపటి సమావేశానికి. హాజరయి తనపరిపాలనలో సహకరించిన గవర్నర్లకందరికి కృతజ్ఞత తెలిపారు. మహారాష్ట్ర ప్రదేశమునకు గవర్నరయిన శ్రీప్రకాష్‌గారు, గవర్నర్లందరి తరుపున తగినట్లు శ్రీప్రసాదుగారిని అభినందించారు.

30వ తారీఖున శ్రీప్రసాదుగారిని రాష్ట్రపతిభవనంలో వ్యష్టిగాను, సమిష్టిగాను సందర్శించి, వీడ్కోలుతీసికొనే సదర్భంలో, హాజరయిన గవర్నర్ల చేవ్రాళ్లు చెక్కబడిన వెండిపళ్లాన్ని వారికి (అధ్యక్షునికి) బహూకరించారు.

సోవియట్ రష్యాయొక్క ఆర్కిటిక్ పరిశోధన రంగంలో 50 మెగటన్ న్యూక్లియరు బాంబు (Megaton nuclear Bomb) అణ్వస్త్రాన్ని 30-10-1961న పరిశోధనార్థం ప్రయోగించింది. ఇంతవరకు కనిపెట్టిన అణ్వస్త్రాలకంటె ఈసర్వనాశనసాధనం మిక్కిలి పెద్దది, వాటిఅన్నిటికన్న నాలుగింతల నిర్మూలన శక్తిగల దీనిఆయుధీయప్రవీణులు చెబుతున్నాను.

ప్రపంచంలోని అన్నిరాజ్యాలు ఇలాటి ఆయుధప్రయోగం అత్యంత అపాయకరమని, ఆప్రయత్నంనుండి విరమించవలసిందని యెంతచెప్పినా, వినక ప్రయోగించిన విషయమే తనకు తెలియదన్నట్టు రష్యా ప్రభుత్వాధికారులుఈవిషయాన్నిగూర్చి ప్రకటించకుండా మూకీభావం వహించారు.- కాని మొట్టమొదటిసారిగా జపానీయుల హిరోషిమాకు సంబంధించిన పట్టణాలమీద రష్యా 1945సం॥రాన 120,000 మంది ప్రజలను బలి తీసుకోవటానికి ప్రయోగించిన ఆటోంబాబు (Atomic bombs) కంటె 2500- వంతులు ఎక్కువ శక్తిపంతమాయిందట ఈ మారణాయుధం.

దాన్ని ఆపేవిషయంలో పెద్దసామ్రాజ్యాలు, చిన్నరాజ్యాలు ఏకోన్ముఖంగా పనిచేయాల్ననీ-రష్యావారిని ఈ విషయంలో ఒత్తిడిచేయాల్నని ఉద్ఘాటించారు. ప్రపంచంలోని అన్నిదేశాలు ఈపరీక్షలకు తీవ్రవిముఖత్వం చూపుతూ, దాన్ని తెలపటానికి రష్యాప్రతినిధుల కార్యాలయాలకు జట్లుజట్లుగా ఊరేగుతున్నారు. అట్టి ఊరేగింపుల్లో స్త్రీలు, పిల్లలు పాల్గొనటం గమనింపతగింది.

సోవియట్ కమ్యూనిస్టు పార్టీ కాంగ్రెసుసభ్యులు 'మాస్కో రెడ్ స్క్వేర్' సమాధిలో భూస్థాపన చేసి పరిమళద్రవ్యములతో క్రుళ్లిపోకుండ భద్రపఱచియున్న జోసఫ్ స్టాలిన్ కళేబరాన్ని, లేవదీసి, శవపేటికలో తగినరీతి జాగ్రత్తపఱచాలి అని తీర్మానించారు.

న్యూయార్కు:- ఐక్యరాజ్యసమితి పక్షాన 3-11-61 నాడు జరిగిన సర్వప్రతినిధిసభ (ఇటీవల మరణించిన) హామర్‌షెల్డ్ స్థానంలో కార్యదర్శిగా, బర్మాప్రతినిధి అయిన శ్రీథాంటును ఎన్నుకొన్నది. వెంటనే ఆయన తనకు ముఖ్యసలహాదార్లుగా, డాక్టర్- రాల్ఫ్‌బంచ్ (అమెరికా), శ్రీజార్జి ఆర్కడేవ్ (రష్యా) లను నియమిస్తున్నట్లు ప్రకటించాడు-. శ్రీ- సి. వి. నరసింహన్ (ఇండియా) ఇదివరకటివలెనే ఇకముందుకూడా- కార్య నిర్వాహకమండలికి ప్రధానిగా ఉండగలడని శ్రీథాంటు మొన్నటిదినమే తెలిపాడు.

ప్రధాని శ్రీనెహ్రూ అమెరికాపర్యటనం, ఈనెల ఆరంభమయింది. వారు సరాసరి లండనునగరానికి వెళ్లి బ్రిటిషుప్రధానిని కలుసుకొని అనేక ప్రపంచసమస్యలనుగూర్చి మాట్లాడారు. అనంతరం అమెరికాకు వెళ్లగానే అక్కడ ఘనమయిన స్వాగతం ఇవ్వబడింది.

విమానం దిగగానే 19 గుండ్లు పేల్చబడినది. అధికారులు అనధికారులు అనేకులు ఆయనకు పరిచయం చేయబడ్డారు. సైనిక వందనాలు మనప్రధాని స్వీకరించగానే ఇరుదేశాల జాతీయగీతాలు బ్యాండువాద్యాలు మ్రోగాయి. గాల్‌బ్రెయితు, రస్కు, భారతప్రతినిధి నెహ్రూ,-ప్రధాని గౌరవార్థం విందులు జరిపారు.

శ్రీనెహ్రూ, అధ్యక్షుడు కెన్నడీలు నాలుగుసారులు తమ ముఖ్యకార్యదర్శుల సమక్షంలోను ఏకాంతంగాను అనేక విషయాలనుగూర్చి చర్చించారు. ముఖ్యంగా అణ్వస్త్ర పరీక్షలనిరోధం విషయాన్ని పెక్కుతడవలు ప్రస్తావించారు. ఇంకా అనగా, బెర్లిన్, అల్జీరియా, కాంగో, అంగోలా, దక్షిణాఫ్రికా, దక్షిణరొడేషియా, ఉత్తరరొడేషియా, కెన్యా, దక్షిణవీట్‌నాం, లావోస్, ఉత్తరవీట్‌నాం, గోవా, తూర్పుపాకిస్థాన్, పడమటిపాకిస్థాన్, కాశ్మీరం, టిబెట్---- మొదలయిన దేశాలక్లిష్ట

సమస్యలనుగూర్చి కూడా సుదీర్ఘంగా, ఆనుపూర్విగా ఆలోచించారు.

ప్రధాని శ్రీనెహ్రూ అమెరికానుండి 12-11-61న మెక్సికోకు వెడుతారని తెలుస్తున్నది- అమెరికాను వీడ్కొనేదానికి ముందు ముఖ్య ప్రపంచక్లిష్టపరిస్థితులను (బెర్లిన్‌తగాదా- అణ్వస్త్రపరీక్షలరద్దు మొదలగువానిని) అదుపునకు తేవటానికి అధ్యక్షుడు శ్రీకెనడీ, ప్రధాని శ్రీనెహ్రూ కూడి ఒకప్రకటనను తమచేవ్రాళ్లతో ప్రచురించారు.

వీడ్కోలు పొందేదానికి ముందు- శ్రీనెహ్రూ తమ మైత్రికి జ్ఞాపక చిహ్నంగా శ్రీకెనడీకి ఒకరాతిబుద్ధవిగ్రహాన్ని,- శ్రీమతి కెనడీకి ఒకపింగాణిమాత్రలడబ్బి, వారినాలుగేండ్లకుమార్తె (కరోలిన్)కు ఒకచూరీదార్ చొక్కా, అద్దంతో తయారయిన పటకా, అందమయిన ఒకవెండిఒడ్డాణం, ఒకయేడు ఈడుగల కొడుకు (జాన్)కు కాగితపు మెత్తటిగంజితో చేయబడిన చేతిచాకుపెట్టె బహుమతిగా సమర్పించాడు.

ఢక్కా:- భారతసైన్యాధికారిఅయిన లెఫ్టనెంటు కర్నల్- శ్రీ- జి. భట్టాచార్య పాకిస్థాను ప్రాంతంలో గూఢచారిచర్యలు జరిపాడన్న నేరంమోపి, ప్రత్యేకసైనిక న్యాయస్థానం విచారణజరిపి- అతనికి 8 ఏండ్లకఠినశిక్ష విధించటమేకాక, అతడికి తోడుపడ్డాడన్న దోషానికి గురిఅయిన రఫీవుద్దీన్ అహ్మదుకు 12 ఏండ్లు, పి. కె.ఘోషు అనేఅతనికి 8 ఏండ్లు కఠినతరం శిక్షలుపడ్డవి. శ్రీభట్టాచార్యకు "ఎ1"- తరగతి, మిగిలిన యిద్దరికి "ఎ3" తరగతి ఖైదు ఖాయపరిచారు.

న్యూఢిల్లీ:- ఈ సంవత్సరాంతంతో పదవీ విరమణం చేయవలసిన- మైసూరు, రాజస్థాన్, పశ్చిమ బెంగాల్, ఉత్తరప్రదేశ్, మహారాష్ట్రల గవర్నర్లఅధికారం 1962 ఏప్రిల్15వ- తేదివరకు పొడిగించబడిందని కేంద్రప్రభుత్వ ప్రకటన తెలుపుతున్నది.

లండన్:- 'ప్రపంచసుందరి'-గా, పోటీకి నిలిచిన యువతులలో- 'కుమారి రోజ్ మేరి ఫ్రాంకుల్యాండు' అందరికంటె- అందకత్తెగా నిర్ణయించబడింది. చైనా లావణ్యవతి, ఫ్రర్మోజా 'లీ-షియూ-యుంగు'- స్పెయినురమణి' కార్మెన్‌సిర్వెరా, ద్వితీయ తృతీయ స్థానాలు పొందారు.

కేరళ:- మతతత్వాన్ని ఆధారంచేసుకొని ప్రవర్తించే కేరళముస్లింలీగు- కాంగ్రెసు- ప్రజాసోషలిస్టు మిశ్రమమంత్రివర్గంతో సహకరించటానికి సమ్మతించని కారణంతో శాసనసభాధ్యక్షుడయిన మహమ్మదు కోయా తనపదవికి రాజీనామా ఇచ్చాడు. అతడల్లా చేసినందువల్ల కాంగ్రెసు, ప్రజాసోషియలిస్టుపార్టీల అధిక సంఖ్యాబలం తగ్గదు. పరిపాలన యథాప్రకారం సాగుతుందని. అశోక మెహతా, శ్రీలాల్బహదూరు శాస్త్రి- వెల్లడించారు.

రష్యా:- ప్రభుత్వపక్షానికి వ్యతిరేకంగా ప్రవర్తించే జట్టుకు నాయకత్వం వహించాడన్న కారణంతో- అధికారవర్గంలోనుంచి బహిష్కరించబడ్డ. శ్రీవ్యాచస్లావ్ మాలెటావ్ తన శ్రీమతితోగూడ మాస్కోకు ప్రయాణమయి వెడలినాడు. కాని ప్రస్తుతం ప్రభుత్వం సాగిస్తున్న పక్షం- అతడు స్టాలినిస్టు కార్యకలాపాల్లో పాల్గొని పనిచేయటానికి సంజాయిషీ చెప్పాల్నని ఆదేశించింది.

ఒరిస్సా:- రాష్ట్ర గణతంత్ర పరిషత్తు వార్షికసభ 11-11-61-న సమావేశంఅయి, స్వతంత్రపార్టీ ఎన్నికలమనోదా తమపక్షం మనోదామోస్తరే- ప్రజాభ్యుదయకర విధానాలను అవలంబించినట్లు ప్రకటించటంవల్లను వాటివిషయంలో అంతగా తేడా వుండదనే విశ్వాసం వల్లను- స్వతంత్రపార్టీతో చేరి ఎన్నికల విషయంలో పనిచేయవలెనని యేకగ్రీవంగా తీర్మానంచేసుకుంది.

ఆంధ్రప్రదేశ్:- నదీజలాల పంపిణీవిషయంలో, లోగడ 1951సం॥న- అందుకు సంబంధించిన రాష్ట్రాలు చేసుకొన్న ఒడంబడికను పరిశీలించి ఈసమస్యను తీర్చటానికి కేంద్రప్రభుత్వం నియమించిన గుల్హాతీ సంఘం- ప్రకృతం ఆంధ్రరాష్ట్రంలో పర్యటిస్తూ 1951 ఒప్పందాన్ని ఖాతరుచేయకుండా; మరలామొదటినుంచి తిరగదోడి తమ ముక్కుకు సూటిగా తోచిన విధాననివేదిక సిద్ధపరచి ఆంధ్రులకు న్యాయంగా రావలసినభాగానికి అడ్డుపడేరకంగా కనిపిస్తూ ఉండటంవల్ల తుంగభద్ర హైలెవల్ కాలువకు భంగంకలగటమే కాకుండా నాగారునసాగరు రెండవదశలోని నిర్మాణకార్యాలు నిలవటం, పోచంపాడు ప్రాజక్టు అడుగున పడటం నిశ్చయం. ఆంధ్రుల జీవన్మరణసమస్య అయిన కృష్ణ-గోదావరి జలాలు వారికి అత్యంతప్రాముఖ్యం- అని వేలకొలది విన్నపాలు గుల్హాతి సంఘానికి అన్నిపక్షాలు సమర్పించింది. పార్లమెంటులోని తెలుగుసభ్యులు నెహ్రూవద్దకు రాయబారంవెళ్లి ఆంధ్రప్రజ పొందే అలజడినిగూర్చి చెబుతూ 1951ఒప్పందము అక్షరాలా జరిగి తీరాల్నని దాన్ని మార్చరాదని ఆయనకు నొక్కివక్కాణించాలి.

ఆంధ్ర మహిళా సభ

మైలాపూర్ - మద్రాసు

మహిళా విద్యాలయము	: హిందీ, కాశీవిశ్వవిద్యాలయపుఎడ్మిషన్, ఆంధ్రామెట్రిక్, ఇ. ఎస్. ఎల్. సి., పరీక్షలకు శిక్షణ.
పారిశ్రామిక విద్యాలయము	: కుట్టు, ఎంబ్రాయిడరీ, ఊలు అల్లికలు, నూలు వడకుట, చేనేత, అచ్చుకూర్పు, ముద్రణ, బైండింగ్ ఇత్యాది పరిశ్రమలలో గవర్నమెంటు పరీక్షలకు శిక్షణ, బీద విద్యార్థినులకు ఉచితము.
మహిళా మందిరము	: విద్యార్థినులకు వసతి గృహము.
ఆంధ్ర మహిళ	: స్త్రీలలో విద్యా వ్యాప్తికై స్త్రీలచే నడుపబడుచున్న సచిత్ర మాస పత్రిక
నర్సింగ్ హోమ్	: స్త్రీ శిశు సంరక్షణశాల, ప్రసూతిశాల, ఉచిత వైద్యశాల, కుటుంబ నియంత్రణశాఖ, దంత వైద్యశాల—అడయారులో నిర్మించబడినవి. భారత ప్రభుత్వ ఆరోగ్య శాఖవారి విధానాన్ని అనుసరించి, సంక్షిప్త నర్స్ ఎయిడ్—మంత్రసాని పనులలో శిక్షణ యివ్వబడు చున్నది. ఫామిలీ ప్లానింగు వర్కర్సుకు శిక్షణ కూడ యివ్వబడుచున్నది.
ఆర్థోపీడిక్ సెంటర్	: వికలాంగులగు బాలబాలికలకు సంరక్షణ, విద్య యిచ్చే సంక్షేమ కేంద్రం.
ముద్రణాలయము	: విద్యార్థినులకు అచ్చుకూర్పు, బైండింగ్, ప్రూఫురీడింగు. మొదలైనవి ఉచితంగా నేర్పబడును. ప్రింటింగు జాబ్ వర్కు చేయబడును.
నాగేశ్వర శిశువిహార్	: పిల్లల విద్యావినోద కేంద్రం ప్రాథమిక పాఠశాల నడుపబడుచున్నది.
అర్బన్ వెల్ఫేరుప్రాజెక్టు	: కపాలి తోట్టంలోను నారాయణస్వామి గార్డెన్‌లోను బీదలకు సంక్షేమ కార్యక్రమముల నిర్వహింపబడుతోంది.
వనితా బాలవిహార్	: స్త్రీలకు, పిల్లలకు, పార్కు, ఆటస్థలం
రీజియనల్ హేండీక్రాఫ్టు యిన్స్టిట్యూట్	: ఆంధ్రమహిళాసభ, హైదరాబాదుబ్రాంచిచే నడుపబడుచున్న, చేతిపనుల శిక్షణాలయము.

ఆంధ్రమహిళ

★

ఆంధ్ర రాజధాని హైదరాబాదునుండి 'ఆంధ్ర మహిళ'ను ప్రచురించటకు ఏర్పాట్లు చేస్తున్నాం. ఇకనుండి తమ చందాలను కార్యదర్శి, ఆంధ్ర మహిళా సభ, బర్కత్‌పుర, హైదరాబాదుకు పంపండి. సం॥ చందా: రు 6 లు

★

ఆంధ్ర మహిళల యేకైక అభ్యుదయ మాస పత్రిక.

Printed at Andhra Mahila Press, 7/A, Rosary Church Road, Published and Owned by Andhra Mahila Sabha, Madras. Editor - Secretary, Andhra Mahila Sabha.